ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

బుధవారం 28 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 132 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

జర్మనీజానికి
డేటా చట్టం ముప్పు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

జర్మనీజానికి మినహాయింపులు లేకపోవడంపై తీవ్ర ఆందోళన

2





2

ఇక నావంతు

ఇన్నేళ్లు 'నా స్టోరీ' వాళ్లు చెప్పారు: సోనియా

ఢిల్లీ సభ..

నవంబర్ 1న రాంలీలా మైదానంలో ఇండియా కూటమి సభ

కాంగ్రెస్‌కు పరీక్ష!

ఓట్ బచావో నినాదంతో బీజేపీపై రాజకీయ పోరు

- తెలంగాణ నుంచి కార్యకర్తలను తరలించేందుకు టీపీసీసీ ప్రణాళిక
- ప్రత్యేక రైళ్లపై స్పష్టత లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- వంద బస్సులతో ఢిల్లీకి తరలింపు యోచన
- అక్టోబర్ 30 నుంచే నేతలు, కార్యకర్తల ప్రయాణ సన్నాహాలు

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR), ఓటు హక్కుల అంశంపై రాజకీయ వేడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో ఇండియా కూటమి భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు, ప్రతిపక్షాల ఐక్యతను చాటడం ఈ సభ ప్రధాన లక్ష్యం. అయితే, సభకు భారీగా జనాన్ని సమీకరించడం కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వానికి కీలకంగా మారింది.

హైదరాబాద్ బ్యూరో - సింగిడి



తెలంగాణ నుంచి భారీ తరలింపు

సభను విజయవంతం చేసేందుకు తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లాలని టీపీసీసీ ప్రణాళిక రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సహా పార్టీ ముఖ్య నేతలు సమీకరణ ఏర్పాట్లపై దృష్టి సారించారు. తెలంగాణ నుంచి సుమారు 15 వేల మంది నాయకులు, కార్యకర్తలను తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, జిల్లా నాయకులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా సభకు బలమైన హాజరు ఉండేలా ప్రయత్నాలు సాగుతున్నాయి.

రవాణా ఏర్పాట్లపై ఉత్కంఠ

భారీ సంఖ్యలో కార్యకర్తలను ఢిల్లీకి తరలించేందుకు రైల్వే సదుపాయాలపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. అయితే, ప్రత్యేక రైళ్ల అంశంలో అనుమతి లభించలేదన్న ...మిగతా 2లో



సాంకేతిక రంగంలో భారత్
గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

2

ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో సరికొత్త ఆలోచనలు, అపారమైన ఆత్మవిశ్వాసంతో భారత్ ముందడుగు వేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ను ఆయన ప్రారంభించారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా కొత్త సాంకేతికతను సృష్టించడమే కాకుండా, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి భారత్ ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. కీలకమైన టెక్నాలజీల్లో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు వివిధ రంగాల్లో భారత్ సాధిస్తున్న విజయాలు అపూర్వమన్న మోదీ, మేడ్ ఇన్ ఇండియా చిప్స్ మొదటి షిప్‌మెంట్లు ఇప్పటికే ప్రపంచ దేశాలకు చేరుకుంటున్నాయని గుర్తుచేశారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (సింగిడి)

కేటీఆర్ పాస్‌పోర్ట్ విషయంలో
వైఖరేంటో చెప్పండి

ఏసీబీకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

ఫార్ములా ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేటీఆర్ పాస్‌పోర్ట్ విషయంలో వైఖరేంటో చెప్పాలని ఏసీబీకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా ఈ రేస్ కేసులో రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి కేటీఆర్ కు నోటీస్ అందింది. ఏసీబీ లేఖతో పాస్ పోర్ట్ అధికారులు నోటీస్ ఇచ్చారు. రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీస్ జారీ చేసిన నోటీసుపై హైకోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. స్టేటస్ కో ఇస్తూ కోర్ట్ ఉత్తర్వులు ఇచ్చింది.

-హైదరాబాద్, అక్టోబర్ 27 (సింగిడి)





2

తెలంగాణలో
కరవు మండలాలు

ప్రకటించిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటిస్తూ జీవో ఎంఎస్ నెం.03 జారీ చేసింది. మొత్తం 365 మండలాల్లో 111 మండలాలు తీవ్ర కరువు 254 మండలాలు మధ్యస్థ కరువు కేటగిరీ కింద వర్గీకరించబడ్డాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణం కంటే 17% లోటు వర్షపాతం నమోదైందని, వరి సాగు విస్తీర్ణం 18% మేర పడిపోయిందని ప్రభుత్వం వెల్లడించింది. రైతులకు నేరుగా డీబీటీ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పథకంలో అదనంగా 50 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు.

-హైదరాబాద్, అక్టోబర్ 27 (సింగిడి)

దూసుకొస్తున్న అర్నబ్

భారీ వర్షాలు .. విరిగిపడుతున్న చెట్లు

ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యం: చంద్రబాబు

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో అర్నబ్ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ జిల్లాలో ఈదురు గాలులతో పాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి. విశాఖపట్నంలో ఇప్పటికే చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద పెద్ద చెట్లు కూలిపోతున్నాయి.

- విశాఖపట్నం, (సింగిడి)



2

పలు రైళ్లు రద్దు చేసిన
దక్షిణ మధ్య రైల్వే

అర్ణబ్ తుపాను కారణంగా రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం

ప్రయాణికుల భద్రత దృష్ట్యా పలు రైళ్లను రద్దు

పోలీస్ శాఖలో నేరాల దర్యాప్తునకు
ప్రత్యేక విభాగం ఏర్పాటు

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల దర్యాప్తు విధులను వేర్వేరు చేయడంలో భాగంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ కీలక ముందడుగు వేసింది. సంక్లిష్టమైన, తీవ్రమైన నేరాల దర్యాప్తు కోసం ప్రత్యేకంగా 'జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్'ను అందుబాటులోకి తెచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా గోల్కొండ జోన్‌లో ఏర్పాటు చేసిన ఈ విభాగాన్ని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మంగళవారం మొహిదీపట్నంలోని గోల్కొండ జోన్ డీసీపీ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు.

-హైదరాబాద్, అక్టోబర్ 27 (సింగిడి)



2

శంకుస్థాపన చేస్తే రాజీనామా చేస్తా

'తుమ్మిడిహెట్టి అయ్యేది కాదు, పాయ్యేది కాదు.. బీజేపీ ఎమ్మెల్యే సంచలన ప్రకటన



2

తెలంగాణలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు చుట్టూ రాజకీయ చర్చ మళ్లీ వేడెక్కింది. ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహారాష్ట్రతో చర్చలు జరుపుతూ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. 148 మీటర్లకు బదులుగా 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం, నీటి లభ్యత, ముంపు భూములు, రైతులకు పరిహారం, పర్యావరణ అనుమతులు వంటి అంశాలు కీలకంగా ఉన్నాయి.

-హైదరాబాద్, అక్టోబర్ 27 (సింగిడి)

జగన్ కంచుకోట బద్దలు

పులివెందులలో కూటమి అభ్యర్థుల ప్రభంజనం



2

వైకాపా అధినేత జగన్ కంచుకోటను తెదేపా బద్దలు కొట్టింది. కడప జిల్లా పులివెందులలో కూటమి అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారు. నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకుగాను 64 ఏకగ్రీవమయ్యాయి. 7 జడ్పీటీసీ స్థానాలకుగాను 3 ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రాష్ట్రంలో పరిషత్ (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మధ్యాహ్నం ముగిసింది. ఒకే నామినేషన్ దాఖలైన చోట ఏకగ్రీవాలుగా ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు ప్రకటిస్తున్నారు.

-కడప, అక్టోబర్ 27 (సింగిడి)

'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్ వైఖరిని
నిలదీసిన చంద్రబాబు

ఈవీఎంలపై కాంగ్రెస్ ది ద్వంద్వ వైఖరి అంటూ చంద్రబాబు వ్యాఖ్యలు

గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా మాట్లాడటం సరికాదని విమర్శ

కొన్ని జాతీయ పార్టీల తీరు గొడ్డలి పార్టీ నేత తీరు ఒకలాగే ఉందని వ్యాఖ్య

గత పాలకుల తప్పులు సరిదిద్దడానికే మూడేళ్లు పట్టిందని వెల్లడి

ప్రజల పట్ల, అభివృద్ధి పట్ల తమది భయం కాదు బాధ్యత అని స్పష్టీకరణ

2

ఎన్నికల యంత్రాంగం, ఎస్ఐఆర్, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అనుసరిస్తోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్ అని, ఓడిపోయినప్పుడు మాత్రం వాటిపై నిందలు వేయడం ఆ పార్టీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు.

-హైదరాబాద్, అక్టోబర్ 27 (సింగిడి)





కేపీహెచ్‌బీలో
దారుణం

2

చిన్నారిని చంపేసి, దంపతుల ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలో ఓ కుటుంబం బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది.

-హైదరాబాద్, అక్టోబర్ 27 (సింగిడి)



సాంకేతిక రంగంలో భారత్
గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

'భారతదేశంలో తయారైన చిప్స్ మొదటి షిప్మెంట్లు ఇప్పుడు ప్రపంచానికి చేరుకోవడం ప్రారంభించాయి. బ్యాటరీ నిల్వల విషయంలో కూడా, మన దేశంలో దొరికే ముడి పదార్థాలపై ఆధారపడేలా కెపాసిటీని నిర్మించేందుకు మేం పని చేస్తున్నాం. అణు రంగం నుంచి అంతరిక్షం వరకు, ఏఐ నుంచి సెమీ కండక్టర్ వరకు – ఈ అన్ని రంగాలకు భిన్నమైన అవసరాలు ఉన్నాయి. కానీ వీటన్నిటికీ ఒకే సందేశం ఉంది. భారతీయ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు వాటి శక్తిని, నమ్మకాన్ని పెంచుకుంటున్నాయి. పరిష్కారాలు, నైపుణ్యం అనే సామర్థ్యాలను కూడా భారతదేశం కలిగి ఉంది. మన దేశంలో ఏదైనా సమస్యకు పరిష్కారం లభిస్తే, అది ప్రపంచంలోని అనేక ఇతర దేశాల సమస్యలను పరిష్కరించగల మార్గాన్ని సృష్టిస్తుంది. మన డిజిటల్ టెక్, 5జీ సాంకేతికత దీనికి గొప్ప ఉదాహరణలు' అని ప్రధాని మోదీ తెలిపారు.

ఇక నావంతు

న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (సింగిడి)

తన భర్త రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని పూర్తిగా వ్యతిరేకించానని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తెలిపారు. తన ఆత్మకథ 'బీలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'కు సంబంధించి సోషల్ మీడియాలో మరో వీడియో పోస్టు చేశారు. దశాబ్దాలుగా తన గురించి ఇతరులు అనేక విషయాలు చెప్పేవారని, ఇప్పుడు తన వంతు వచ్చిందన్నారు. ఈ పుస్తకం విడుదలైన తర్వాత కొన్ని నాటకీయ పరిణామాలు జరగడం ఖాయమన్నారు.

మా ప్రేమ ప్రయాణం మొదలైంది: 'ఎక్స్'లో సోనియా తొలిపోస్ట్

''నా గురించి అనేక వార్తలు వచ్చాయి. కానీ, వాటిలో చాలా వరకు అవాస్తవాలు, కల్పితాలే. మరికొన్ని అతిశయోక్తిగా అనిపించాయి. అందుకే స్వయంగా వాస్తవాలను చెప్పాలనుకున్నా. ఇది నా కథ. ప్రజలకు నా గురించి అనేక అభిప్రాయాలున్నాయి. దీని తర్వాత కొంతమంది నాపై అభిప్రాయాన్ని మార్చుకోవచ్చు. మరికొందరు మరింత దిగజారవచ్చు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు లేదా ఏదైనా పుస్తకం రానిసప్పుడు ఇలాంటివి సాధారణమే'' అని సోనియా పేర్కొన్నారు. తాను ఎదుర్కొన్న సంఘటనల గురించి వాస్తవాలను తెలియజెప్పేందుకు తనకు ఇదో అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు.

శంకుస్థాపన చేస్తే
రాజీనామా చేస్తా

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ సర్కార్ ముందుకు సాగుతున్న వేళ బీజేపీ నేత, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆయన సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఒక టీవీ ఛానల్ నిర్వహించిన చర్చలో పాల్గొన్న పైడి రాకేష్ రెడ్డి.. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కార్యరూపం దాల్చే అవకాశం లేదని తేల్చి చెప్పేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటనలు చేయడం, హడావుడి చేయడం తప్ప క్షేత్రస్థాయిలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి స్పష్టత లేదని పైడి రాకేశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి చూపించాలని అన్నారు. అలా జరిగితే తాను వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. మహారాష్ట్రతో చర్చలు జరుపుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని ఆయన ప్రధానంగా విమర్శించారు. రెండు రాష్ట్రాల మధ్య సంప్రదింపులను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆరోపించారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ విషయంలో
వైఖరేంటో చెప్పండి

ప్రతివాదులు అందరికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 6 వాయిదా వేసింది. కేటీఆర్ పాస్ పోర్టును ఎందుకు జప్తు చేయకూడదో వివరించాలని కోరుతూ రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీస్ సెప్టెంబర్ 28న కేటీఆర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటీసును సవాల్ చేస్తూ కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పాస్ పోర్ట్ అథారిటీ చర్యలు చట్ట విరుద్ధంగా ఉన్నాయని, ఏకపక్షంగా.. పక్షపాత ధోరణిలో ఉన్నాయని.. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19, 21 కింద తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని కేటీఆర్ తన పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతివాదులుగా కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారి, ఏసీబీ డైరెక్టర్ జనరల్ ను చేర్చారు.

కేపీహెచ్‌బీలో దారుణం

పశ్చిమ్‌బెంగాల్‌కు చెందిన గోపీనాథ్, సమత 2023లో ప్రేమ వివాహం చేసుకుని.. కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల పాప ఉంది. మంగళవారం ఉదయం నుంచి ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి డయల్ 112కి ఫోన్ చేసి సమాచారం అందించారు. పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని తలుపులు పగల గొట్టి చూడగా.. గోపీనాథ్, సమత డైనింగ్ హాల్లో ఉరివేసుకొని కనిపించారు. బెడ్‌రూమ్‌లో పాప విగతజీవిగా కనిపించింది. పాపని చంపేసి ఆ తర్వాత దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని.. బలవన్మరణానికి ముందు గోపీనాథ్, సమత గోడపై రాసినట్లు పోలీసులు గుర్తించారు. గోపీనాథ్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ కంచుకోట బద్దలు

పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి మండలంలో 18 ఎంపీటీసీలకు గాను 17 ఏకగ్రీవమయ్యాయి. తెదేపా 15, భాజపా, జనసేన ఒక్కో స్థానంలో ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దీంతో మండలంలోని అల్లిరెడ్డిపల్లె ఎంపీటీసీ స్థానానికి మాత్రమే ఎన్నిక జరగనుంది. పులివెందుల మండలంలోని ఐదు ఎంపీటీసీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. వేముల మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చక్రాయపేట మండలంలోని 9 ఎంపీటీసీల్లోనూ తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. తొండూరు మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లోనూ తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింహాద్రిపురం మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లోనూ తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.

జర్నలిజానికి డేటా చట్టం ముప్పు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

డిజిటల్ డేటా పరిరక్షణ చట్టంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

జర్నలిజానికి మినహాయింపులు లేకపోవడంపై తీవ్ర ఆందోళన

దర్యాప్తు జర్నలిజానికి, సోర్సుల గోప్యతకు ప్రమాదమని పిటిషన్‌లో వాదన

పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (సింగిడి)

డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం, 2023లోని కీలక నిబంధనలు జర్నలిజం మనుగడకే ప్రమాదకరంగా మారాయంటూ దేశంలోని ప్రముఖ మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వకపోవడం వల్ల దర్యాప్తు కథనాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, ప్రచురితమైన వార్తలను తొలగించాల్సి వస్తుందని, రహస్య సోర్సుల వివరాలు బయటపెట్టాల్సి వస్తుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని 21 ప్రముఖ మీడియా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వ వాదన వినకుండా చట్టంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పౌరుల హక్కులు, మీడియా హక్కుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని సీజేఐ సూర్యకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేస్తూ, ఈ



అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

జర్నలిజానికి ముప్పు తప్పదు: పిటిషనర్ల వాదన

సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, ఈ చట్టం "ముందస్తు సెన్సార్‌షిప్" విధించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక వార్తా కథనం రాయాలంటే, అందులోని వ్యక్తుల అనుమతి కోసం ఎదురుచూడాల్సి వస్తే, ఇక వార్త అనే భావనకే అర్థం ఉండదు. ఈ చట్టం వల్ల న్యూస్ రూమ్‌లు మూతపడతాయి" అని ఆమె కోర్టుకు వివరించారు. గతంలో తీసుకొచ్చిన డేటా పరిరక్షణ చట్టాల ముసాయిదాలలో జర్నలిజానికి మినహాయింపులు ఉండేవని, కానీ తుది చట్టంలో వాటిని తొలగించారని ఆమె గుర్తు చేశారు. చట్టంలోని సెక్షన్ 7, 17(2), 18, 19, 27, 29, 36, 37, 44(3)లతో పాటు, DPDP రూల్స్, 2025లోని 16, 17, 23 నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(a)లకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ నిబంధనల ప్రకారం, ప్రచురితమైన కథనాలపై వ్యక్తులు అభ్యంతరం తెలిపితే, వారి డేటాను తొలగించాల్సి వస్తుంది. ఇది చారిత్రక రికార్డులను సైతం మార్చే ప్రమాదం ఉందని వారు వాదించారు. అలాగే, సెక్షన్ 36 ప్రకారం, ప్రభుత్వం ఎలాంటి జ్యుడీషియల్ పర్యవేక్షణ లేకుండా మీడియా సంస్థల నుంచి సమాచారం కోరవచ్చని, ఇది రహస్య సోర్సుల గోప్యతకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల వరకు జరిమానా విధించడం చిన్న, ప్రాంతీయ మీడియా సంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని తెలిపారు.

ఆర్‌టీఐ చట్టం నిర్వీర్యం

ఇదే చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా సమాచార హక్కు (RTI) చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(j)ని సవరించడాన్ని కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ సవరణ వల్ల, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కూడా వ్యక్తిగత సమాచారాన్ని పొందడం కష్టతరం అవుతుందని, ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు అని వాదించారు. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం 2025లో నోటిఫై చేసింది. 2027 మే నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది. జర్నలిజానికి మినహాయింపులు కోరుతూ DNPA ఇప్పటికే కేంద్ర సమాచార, ప్రసార, ఐటీ మంత్రిత్వ శాఖలతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈయూ, యూకే, సింగపూర్ వంటి దేశాల్లోని డేటా చట్టాల్లో జర్నలిజానికి స్పష్టమైన మినహాయింపులు ఉన్నాయని పిటిషనర్లు గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చే సమాధానం తర్వాత ఈ కేసు విచారణ కీలక దశకు చేరుకోనుంది.

ఢిల్లీ సభ.. కాంగ్రెస్‌కు పరీక్ష!

మొదటి పేజీ తరువాయి..

సమాచారం నేపథ్యంలో ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సుమారు వంద బస్సులను సిద్ధం చేసి కార్యకర్తలను తరలించే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. అక్టోబర్ 30 నుంచే ప్రయాణాలు ప్రారంభించి, సభ సమయానికి కార్యకర్తలంతా ఢిల్లీకి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నది నాయకత్వం ఆలోచన. అయితే, ప్రత్యేక రైళ్ల నిరాకరణ, బస్సుల సంఖ్యకు సంబంధించిన వివరాలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

సభ సక్సెస్‌పైనే దృష్టి

ఢిల్లీ సభ ద్వారా ఓటర్ల జాబితాల సవరణపై తమ నిరసనను జాతీయ స్థాయిలో వినిపించాలని కాంగ్రెస్ భావిస్తోంది. సభకు ఎంతమంది హాజరవుతారు? తెలంగాణ నుంచి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవైపు జాతీయ రాజకీయ సందేశం, మరోవైపు రాష్ట్ర పార్టీ యంత్రాంగం సమీకరణ సామర్థ్యం.. రెండింటికీ ఈ సభ పరీక్షగా నిలవనుంది.

ఓటు హక్కులపై చర్చ ప్రజల్లోకి

ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు, సవరణ ప్రక్రియ పారదర్శకత వంటి అంశాలపై రాజకీయ పార్టీలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ అంగీకరించడం లేదు. ఈ పరిస్థితుల్లో సభలో చేసే ప్రసంగాలకంటే, ఓటర్ల జాబితాలపై ఆధారాలతో కూడిన చర్చ, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రజలకు ముఖ్యం. భారీ జనసమీకరణతో పాటు ఓటు హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచగలిగితేనే ఈ నిరసన కార్యక్రమానికి విస్తృత ప్రయోజనం చేకూరుతుంది.

దూసుకొస్తున్న అర్నబ్

అర్నబ్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు భారీ స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు చెందిన 30 వేలకుపైగా బోట్లను సముద్రం నుంచి వెనక్కి రప్పించామని, గోపాల్‌పూర్‌లో ఏపీకి చెందిన 93 బోట్లు, వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధం చేయడంతోపాటు, 5వేల మంది గర్భిణులను సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించినట్లు వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని సిద్ధం చేశామని, తుపాను ప్రభావంతో 15 వేల వరకు విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువే..

నాగావళి, వంశధార నదులకు వరద వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉన్నామని, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను అంచనా వేస్తూ చెరువులకు గండ్లు పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ముంపు గ్రామాలకు ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు,



జనరేటర్లను సిద్ధం చేశామని తెలిపారు. సుమారు 7.16 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 16 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంత గ్రామాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని, నీటి ప్రవాహాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తోపాటు నౌకాదళం, కోస్టుగార్డులను అప్రమత్తం చేశామని, హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువగా ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల

ఆర్నబ్ తుపాను ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తుపాను సన్నద్ధతపై నిరంతరం సమీక్షిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని తెలిపారు. పశ్చిమగోదావరి, కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, కాకినాడ సమీపంలోని యానాం వద్ద తుపాను తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ ప్రాంతాల్లో నష్టం తీవ్రత అధికంగా ఉండొచ్చని, కొన్ని చోట్ల అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. శ్రీకాకుళంలో 30 సెంటీమీటర్లు, పశ్చిమ గోదావరిలో 28, విశాఖపట్నంలో 23 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, చాలా ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షాలు కురుస్తాయని వివరించారు. తీరప్రాంత జిల్లాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చే ప్రమాదం ఉన్నందున తీర గ్రామాలు, లంకలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 290 శిబిరాలు ఏర్పాటు చేసి 84,396 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తున్నాయని, ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల చేస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.



'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్ వైఖరిని
నిలదీసిన చంద్రబాబు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "రాజ్యాంగబద్ధమైన వ్యవస్థగా ఎన్నికల కమిషన్ ది ఎప్పుడూ ఒకే విధానం. సీఈసీ విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరులు అనుసరిస్తున్నాయి. 'సర్'పై ఒకచోట ఒక వైఖరి, మరోచోట మరోవైఖరి అవలంభిస్తారా..? ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ.. గెలిస్తే ఈవీఎంలు సక్రమంగా ఉన్నట్టు, అదే ఓటమి పాలైతే ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపించడం సరైనదేనా? ఇది ఎక్కడి వైఖరి?" అని తీవ్రంగా ప్రశ్నించారు. ఇదే ఈవీఎంలతో గెలిచిన విషయాన్ని ఆ పార్టీలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేవలం కేంద్రంపై, రాష్ట్రాలపై బురద చల్లేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. జాతీయ స్థాయిలో కొన్ని పార్టీలు వ్యవహరిస్తున్న తీరు, రాష్ట్రంలోని 'గొడ్డలి పార్టీ' నేత తీరు ఒకేలా ఉందని చంద్రబాబు పరోక్షంగా వ్యాఖ్యానించారు. తనకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరించడం కొందరికి అలవాటైందని ఆయన దుయ్యబట్టారు. "ఒక వ్యక్తి వైఖరి వల్ల రాష్ట్రం ఎందుకు నష్టపోవాలి? రప్పరప్పా రాజకీయాలు చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తారా? గతంలో రాజకీయాల్లోకి రౌడీలు వస్తే ప్రజలు గమనించేవారు, కానీ ఇప్పుడు రౌడీలే రాజకీయం చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు చేసిన అవకతవకలను సరిదిద్దడానికే తమకు మూడేళ్ల సమయం పట్టిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మించాలంటే సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, ఎన్డీఏ ప్రభుత్వం ఆ దిశగానే నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ప్రజల పట్ల, రాష్ట్రాభివృద్ధి పట్ల తమకు ఉన్నది భయం కాదని, బాధ్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

తెలంగాణలో కరవు మండలాలు

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో అల్లాడుతున్న రైతులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా అధికారికంగా ప్రకటిస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో ఎంఎస్ నెం.03 ఉత్తర్వులు జారీ చేశారు. శాస్త్రీయ అధ్యయనం, రిమోట్ సెన్సింగ్ డేటా, క్షేత్రస్థాయి పరిశీలనల అనంతరం కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఈ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ కరువు ప్రకటన గెజిట్‌లో ప్రచురితమైన తేదీ నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. తుపాను కారణంగా ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 27, 28 పలు రైలు సర్వీసులను పూర్తిగా రద్దు చేయగా, ఓ రైలును పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించింది. ఈ మేరకు రద్దయిన రైళ్ల జాబితాను కూడా విడుదల చేసింది. తుపాను తీరం వైపు సమీపిస్తున్న కొద్దీ బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడం, సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వంటి ప్రమాదాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. ముఖ్యంగా సికింద్రాబాద్, హైదరాబాద్, లింగంపల్లి వంటి ప్రధాన స్టేషన్ల నుంచి కోస్తాంధ్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లే సర్వీసులపై ఈ ప్రభావం పడింది. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు తప్పనిసరిగా రైలు నడిచేదీ లేనిది నిర్ధారించుకోవాలని, రైల్వే అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా తమ రైలు స్టేటస్‌ను తెలుసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

పూర్తిగా రద్దయిన రైళ్ల జాబితా:
12704–సికింద్రాబాద్ నుంచి హౌరా
17016–సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్
12728 – హైదరాబాద్ నుంచి విశాఖపట్నం
12862 – మహబూబ్‌నగర్ నుంచి విశాఖపట్నం
12740 – లింగంపల్లి నుంచి విశాఖపట్నం
17256 – లింగంపల్లి నుంచి నర్సాపూర్
12776 – సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్
12738 – లింగంపల్లి నుంచి కాకినాడ పోర్ట్
20810 – హెచ్.ఎస్. నాందేడ్ నుంచి సంబల్‌పూర్
07037 – చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్
07038 – శ్రీకాకుళం రోడ్ నుంచి చర్లపల్లి

పోలీస్ శాఖలో నేరాల దర్యాప్తునకు ప్రత్యేక విభాగం ఏర్పాటు

ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల దర్యాప్తు బాధ్యతలను ఒకే సిబ్బంది నిర్వహిస్తున్నారు. బందోబస్తులు, రోజువారీ విధుల ఒత్తిడి కారణంగా కీలక కేసుల దర్యాప్తుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో తీవ్రమైన కేసుల విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

15 మందితో ప్రత్యేక బృందం

గోల్కొండ జోన్ పరిధిలోని కీలక కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేపట్టేందుకు ఇద్దరు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, 10 మంది కానిస్టేబుళ్లతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. హెల్త్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, న్యాయ తదితర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయనున్నారు. సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేసి, నిందితులకు న్యాయస్థానాల్లో చట్టప్రకారం శిక్షలు పడేలా ఈ బృందం పనిచేయనుంది.

దర్యాప్తుపైనే ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. బాధితులకు సకాలంలో పూర్తిస్థాయిలో న్యాయం జరిగినప్పుడే పోలీసింగ్ వ్యవస్థకు అసలైన సార్థకత చేకూరుతుందన్నారు. బందోబస్తులు, రోజువారీ విధుల ప్రభావం



కేసుల విచారణపై పడకూడదనే లక్ష్యంతోనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు మొదలుకుని న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసే వరకు ఈ బృందం కేసు పరిష్కారంపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తుందన్నారు. ఆధునిక శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేసినప్పుడే న్యాయస్థానాల్లో నేర నిరూపణ సాధ్యమై దోషులకు శిక్షలు పడతాయని పేర్కొన్నారు.

**నేరాల నియంత్రణపై దృష్టి సారించేందుకు..

నేడు వికారాబాద్‌లో ఓటు బచావో దేశ్ బచావో,

- డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27 (సింగిడి): వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సత్య భారతి ఫంక్షన్ హాల్లో నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమం నిర్వహించనున్నట్లు డి సీ సీ అధ్యక్షుడు దారసింగ్ తెలిపారు. అదేవిధంగా జిల్లా కార్యవర్గం సమావేశంతో పాటు మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ పరిశీలకులు రంగరాజన్ మోహన్ కుమారమంగళం, టీపీసీసీ కోఆర్డినేటర్ అఫ్సర్ యూసుఫ్ జాహీ హాజరుకానున్నారు. వికారాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు టి. రామ్మోహన్ రెడ్డి, బుయ్యని మనోహర్ రెడ్డితో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొననున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమం అమలు, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల, టౌన్ అధ్యక్షులు, వివిధ సంస్థల చైర్మన్లు, ఎస్ఐఆర్ కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సెల్ నాయకులు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ వోలు ల్), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు జాదవ్ దారాసింగ్ నాయక్ కోరారు.

బాండెడ్ లేబర్ నిర్మూలనకు ప్రత్యేక వాహనం ప్రారంభించిన కలెక్టర్



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27 (సింగిడి): కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాండెడ్ లేబర్ (వెట్టి చాకిరీ) నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరీ నిర్మూలనకు కృషి చేస్తామని, చట్టాల అమలు లో నిష్పక్ష పాతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు చేపడుతా మని, వెట్టి చాకిరీ నిర్మూలన ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం కలిపించేలా నిబద్ధత తో పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వెట్టి చాకిరీ వంటి అమానవీయ విధానాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాండెడ్ లేబర్‌కు గురైన బాధితులను గుర్తించి, వారికి విముక్తి కల్పించడంతో పాటు పునరావాసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తగిన సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రత్యేక వాహనం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బాండెడ్ లేబర్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వెట్టి చాకిరీకి సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు బాధితులు, ప్రజలు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాండెడ్ లేబర్ నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ మానవ హక్కులను గౌరవిస్తూ వెట్టి చాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, కార్మిక శాఖ అధికారి వాల్య నాయక్, బి సి, ఎస్సి అధికారులు మాధవ రెడ్డి, జయపాల్ రెడ్డి, హైదరాబాద్ నుండి వచ్చిన కళాకారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆశయాలు స్ఫూర్తిదాయకం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

సిద్ధిపేట ప్రతినిధి అక్టోబర్ 27 (సింగిడి): భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పార్టీ శ్రేణులతో కలిసి వాల్మీకి ఫోటోకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాల్మీకి మహర్షి సమాజానికి ధర్మం,సత్యం, నీతి,మానవత్వం వంటి గొప్ప విలువలను చాటి చెప్పారని కొనియాడారు. ఆయన జీవితం,ఆశయాలు నేటి తరాలకి స్ఫూర్తిదాయకం అన్నారు. వాల్మీకి చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి దేశ సేవకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల నాగరాజు, ప్రశాంత్,ప్రణయ్,భరత్,సాయి,రాకేష్,వివేక్ ధర్మతేజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరిని పరామర్శించిన ఎమ్మెల్యే



కాప్రా, అక్టోబర్ 27 (సింగిడి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఈసీఐఎల్ లోని సూర్య హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విలేకరిని సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోహన్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం

"అసెజ్ వావో" సంస్థ కృషి అభినందనీయం

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27 (సింగిడి): బ్లూ ఓసియన్ ప్రాజెక్ట్ లో 132 – జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్న "అసెజ్ వావో" సంస్థ ప్రతినిధులుసోమవారంకుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యేనివాస కార్యాలయం వద్దబిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్లూ ఓసియన్ ప్రాజెక్ట్ లో భాగంగా చెరువుల సుందరీకరణతో పాటుగా పర్యావరణ పరిరక్షణకై చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే కు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవ మనుగడతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరమని, చెరువులకు పూర్వ వైభవం తెచ్చేలా "అసెజ్ వావో" సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెస్సీ తెలంగాణ సంస్థ ప్రతినిధులు కృపాకర్, ఆశిష్, మహేంద్ర, శిరీష, రోషిణి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి జీవితం, ఆదర్శాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

వాల్మీకి మహర్షి చూపిన మార్గంలో నడవాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 27 (సింగిడి): మహర్షి వాల్మీకి జీవితం, ఆదర్శాలు, ఆయన రచించిన రామాయణం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయక మని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. ఆయన జీవితం మనిషిలో మార్పు సాధ్యమేనని, పట్టుదల, జ్ఞానం, నిరంతర కృషితో ఉన్నతమైన లక్ష్యాలను సాధించవచ్చని చాటిచెబుతుందన్నారు. మహర్షి వాల్మీకి బోధనలను ఆచరిస్తూ సమాజంలో సద్భావన, సమానత్వం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, వివిధ శాఖల అధికారులు, వాల్మీకి జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ బోయ వెంకటేశం, వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులు వెంకట రామయ్య, బుచ్చయ్య, సంఘమేష్, ప్రభు, బక్కప్ప, శివరాజ్, శ్రీనివాస్, అనిల్, రాములు, ఆగమయ్య, రాజు, పండరి, జ్ఞానేశ్వర్, దినేష్ పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27 (సింగిడి): జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఎన్ ఐ సి హాలు లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ వెంకటాచారి ల తో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 94 దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్, ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యతనిస్తూ, పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు ఉన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎస్పీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావడంతో పాటు, వారి సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, పారదర్శకంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



కలెక్టరెట్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుక

నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27 (సింగిడి): సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో బి సి వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఆయన బోధనలు సమాజానికి సత్యం, ధర్మం, న్యాయం, మానవీయ విలువల మార్గంలో నడిచేందుకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, జడ్ పి సి ఇ ఓ సుధీర్,డి ఆర్ డి ఎ శ్రీనివాస్, డి పి ఓ జయసుధ,బీసీ వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి,జయపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

- బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాలు



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 27 (సింగిడి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టపరమైన పరిష్కారం అందించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన జిల్లా ఎస్పీ, వారి సమస్యలను ఓపికగా విని ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, చట్టపరమైన పరిష్కారం మరియు సత్వర న్యాయం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుందని ఎస్పీ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- డాక్టర్ ఏఎస్ రావు నగర్ రౌండ్ బిల్డింగ్ వద్ద గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్ ప్రారంభం



కాప్రా, అక్టోబర్ 27 (సింగిడి): మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకునేలా విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లి, అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ రౌండ్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు హెల్ప్ డెస్క్ ను సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన అంశమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యావంతులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌ల ద్వారా నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను అందిస్తూ, అర్హులైన పట్టభద్రులకు అవసరమైన సహకారం అందించాలని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులందరూ తమ ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టి సారించి, ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటికకు స్థలం కేటాయించాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి కి మార్వాడీ సర్వి సమాజ్ ప్రతినిధులు వినతి



కాప్రా, అక్టోబర్ 27 (సింగిడి): కాప్రా సర్కిల్ చర్లపల్లి, ఈసీ నగర్‌కు చెందిన మార్వాడీ సర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమాజానికి ప్రత్యేక స్మశాన వాటిక ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సోమవారం సైనిక్‌పురిలోని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రంను అందజేశారు. తమ సమాజానికి ప్రత్యేక శ్మశానవాటిక లేకపోవడంతో మృతుల అంత్యక్రియల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమాజ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెర్లపల్లి పరిధిలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శ్మశానవాటిక ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ మార్గదర్శకాలు, ఇతర చట్టపరమైన విధివిధానాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్మశానవాటిక ఏర్పాటైన అనంతరం దాని నిర్వహణ, పరిశుభ్రత, పరిరక్షణ బాధ్యతలను కూడా సమాజం తరఫున చూసుకుంటామన్నారు. అనంతరం ఈ అంశంపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని మార్వాడీ సర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో మార్వాడీ సర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న ఢిల్లీలో 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసనను విజయవంతం చేయాలి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27 (సింగిడి): ఏఐసీసీ పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో' భారీ నిరసన కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీపీసీసీ అబ్జర్వర్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో పాటు రామగుండం, మంథని నియోజకవర్గాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఐసీసీ ఉమ్మడి జిల్లాక్లస్టర్ ఇన్‌చార్జి శరత్, నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రం లో సైతం జిల్లా అధ్యక్షులు నందయ్య ఆధ్వర్యంలో ఓటు బచావో– దేశ్ బచావో కార్యక్రమానికి సంబంధించిన జిల్లా కార్యవర్గ సభ్యుల తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



సిద్ధిపేట ప్రతినిధి అక్టోబర్ 27 (సింగిడి): సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ హైమావతి లు ముఖ్య అతిథులుగా హాజరై ధూళ్‌మిట్ట మండలం, జాల పల్లి గ్రామానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొండల్ రెడ్డి, సర్పంచులు కరుణాకర్, కొమ్ము రవి, కొమ్ము నర్సింగరావు, కొల్పుల యాదగిరి అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలే ప్రాధాన్యం

నాలా పరిస్థితిని పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు



సికింద్రాబాద్ అక్టోబర్ 27 (సింగిడి): సికింద్రాబాద్ బౌద్ధ నగర్ డివిజన్‌లోని ఈశ్వరీబాయి నగర్, ఏఆర్‌కే నగర్ మధ్య ఉన్న నాలాలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్ అక్కడికి చేరుకొని నాలా పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ.. నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత దృష్ట్యా అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎడిటోరియల్

Editorial

బాల సాహిత్యంలో ధృవతార అవసరాల

అక్టోబర్ 28... అవసరాల రామ కృష్ణారావు వర్ధంతి

అవసరాల రామకృష్ణారావు ప్రముఖ సాహితీ వేత్త, నవలా రచయిత. తెలుగు సాహిత్యం బతికి బట్టకట్టినంతకాలం గుర్తుంచుకునే కథా భీష్ముడు. ఆయన 1931, డిసెంబర్ 21న చెన్నైలో జన్మించి న రామ కృష్ణారావుకు బాల సాహిత్యంలో అజరా మరం గా నిలిచిన చందమామతో ఆయనకు గల బంధం, అనుబంధం విడదీయరానిది.

ఏడు పదుల ఏళ్ళకిందట తన 15 సంవత్సరాల తొలి సంధ్య లో చందమామ 1947 జూలై సంచిక 'లో 'పొట్టిపిచిక కథ'తో ప్రారంభించింది మొదలు మలి సంధ్యలో 80ఏళ్ళ వయసు వరకు రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన విశిష్ట కథా రచయిత. పొట్టి పిచిక కథ ప్రారంభ, ముగింపులు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి.

'పొట్టి పిచిక కథ' రచనే తన విజయ సూత్రం అవుతుందని ఆనాడు, ఏనాడూ అనుకోలే దని చెప్పేవారు. పదిహేనేళ్ల ప్రాయంలో రాసిన, ఈ కథ ఇచ్చే సందేశం నిజంగా అద్భుతం. వెయ్యికి పైగా రచనలు చేసి, తల వంచక, కలం దించక తెలుగు కథకుడిగా కొనసాగి సుదీర్ఘ సాహితీ వ్యాసంగంలో పక్షులతో జంతువులతో మనుషుల్ని కలిపి సామాజికాంశాల్ని



అలవోకగా కథా వస్తువులుగా చేసు కోవడానికి చందమామ పత్రికనే భూమిక అని చెప్పేవారు. చందమామ కథ ఇచ్చిన ఊపుతో తాను రాసిన సుప్రసిద్ధ పిల్లల రచనల్లో 'కేటూ డూప్లికేటూ,' 'మేథ మేట్రిక్స్,' మూడు భాగాలూ, 'ఆంగ్రేజీ మేడీజీ,' 'ఆంగ్రేజీ యమ ఈజీ వంటి అరడజను రచనలు భాగమని కూడా ఆయన ఘనంగా చెప్పుకున్నారు. తెలుగులో నవలలు, కథలు వెయ్యికి పైగా రాసి వన్నెకెక్కి న కథా రచయితగా పేరు తెచ్చు కున్నారు. ఆయన తుని ఎస్సార్ ఉన్నత పాఠశాలలో లెక్కలు, సైన్సు బోధించారు. ఒరిస్సాలో ఇంగ్లీషు రీడర్ గా పని చేశారు. విశాఖ పట్నంలో ఇంగ్లీషు లెక్చరర్ గా పని చేశారు. వృత్తి జీవితమంతా ఆంగ్ల భాష బోధించినా, తెలుగు భాష పై ఉన్న వ్యామోహం తోనే దశాబ్దాల కాలంలో వెయ్యికి పైగా రచనలు మాతృ భాష లోనే చేశారు. ఆధునిక సమాజం తెస్తున్న మార్పుల్లో కొన్నింటికి దూరంగానే ఉన్నా నని అంగీకరించారు.

మనం మనుష్యులం, సహ జీవన సౌభాగ్యం, ఇంకానా అంతరాలు? అడుగో మావయ్య, ఆ వెనకే మేరీ, సంపెంగలూ, సన్నజాజులూ, మేం చేసిన తప్పు మీరూ చేస్తారా?, అది ప్రశ్న, ఇది జవాబు, హెడ్మిస్ట్రెస్ హేమ లత, పేక ముక్కలు, కథా వాహిని, గణిత విశారద, కేటూ, డూప్లికేటూ, అర్థమున్న కథలు, రామ చిలుక, మోహన రాగం, మేథమే ట్రిక్స్ 1, మేథ మేట్రిక్స్2 మేథమే ట్రిక్స్3, అంగ్రేజీ మేడీజీ "తదితర రచనలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం (1969), తెలుగు విశ్వ విద్యాలయం హాస్య రచయిత పుర స్కారం (1994), జ్యేష్ఠ లిటరరీ అవార్డు (1998), కొలసాని చక్రపాణి అవార్డు (1999), ఢిల్లీ తెలుగు ఎకాడమీ ఉగాది పురస్కారం (2000). ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వైభవం పురస్కారం (2004) తదితర అవార్డులు, పుర స్కారాలు ఆయన కు లభించాయి. అవసరాల 2011, అక్టోబర్ 28న హైదరాబాదులో తుది శ్వాస విడిచి, ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ఆనిమేషన్ కళకు అత్యాధునిక రంగులు అద్దుతున్న టెక్నాలజీ

(28 అక్టోబర్ 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం' సందర్భంగా..

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, పౌరాణిక గాథల ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మట్నదలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు ఆనిమేషన్ కళకు సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను ఆనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా, సరళంగా,



స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయంలో గొప్ప భావాలను వ్యక్తం చేయవచ్చు.

ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్ చొరవ:
28 అక్టోబర్ 1892లో తొలి సారి పారిస్‌లో ఆనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా ఆనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్య, చలనచిత్రరంగాల్లో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో "ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్" నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవం(ఇంటర్నేషనల్ ఆనిమేషన్ డే)' పాటించుట జరుగుచున్నది. ఆనిమేషన్ కళకు సృజనను జోడించి నూతనత్వాన్ని ఆపాదించడం, ఆనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, ఆనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, ఆనిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత ఆనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, ఆనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, ఆనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ ఆనిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు.

బహుళ ప్రచారం పొందుతున్న కళ:
ప్రపంచవ్యాప్తంగా ఆనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బోమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ, వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మట్నదలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనాలతో కాకుండా వ్యాపారవర్గాలలో కూడా ఆనిమేషన్ కళ ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టివీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

ఆనిమేషన్ కళ ప్రయోజనాలు:
అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడంతో సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షనీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మట్నదటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మట్నదటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. నేడు అత్యాధునిక "స్టాప్ మోషన్ ఆనిమేషన్", "టైపోగ్రఫీ ఆనిమేషన్" టెక్నాలజీలు అమలులోకి వచ్చాయి.

ఆధునిక డిజిటల్ యుగపు యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ దృశ్య రుచులను చూపుతారని ఆశిద్దాం.

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన పాశ్చాత్య జ్ఞాని

అక్టోబర్ 28...మాక్స్ ముల్లర్ వర్ధంతి

మాక్స్ ముల్లర్ 19వ శతాబ్దంలో భారతీయ సాహిత్యాన్ని పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప భాషావేత్త, తాత్వికుడు, తులనాత్మక మత శాస్త్రవేత్త. ఆయన భారతీయ వేద సాహిత్యానికి చేసిన సేవల కారణంగా భారతీయ సాంస్కృతిక అధ్యయనాల్లో ఓ కీలక స్ఫూర్తి దాయక వ్యక్తిగా నిలిచారు.మాక్స్ ముల్లర్ 1823 డిసెంబర్ 6న జర్మనీలోని డెసావ్ పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి ప్రముఖ కవి, రచయిత. చిన్నతనం నుండే ముల్లర్‌కు భాషలపై ఆసక్తి పెరిగింది. లైప్జిగ్ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రం (గ్రాష్ట్రఅశ్రీశీశ్రీశీస్త్రఎ) చదివిన ముల్లర్, తరువాత ఫ్రాన్స్ మరియు ఇంగ్లాండ్‌లో సంస్కృతం, తత్వశాస్త్రంలో తన అధ్యయనాలను విస్తరించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా స్థిరపడి, తన సార్వత్రిక పరిశోధనలను కొనసాగించారు.

మాక్స్ ముల్లర్ భారతీయ సాహిత్యం, ముఖ్యంగా వేదాల పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం వంటి వేదాలను పఠించి, వాటిని పాశ్చాత్య సమాజానికి పరిచయం చేయడం కోసం ఇంగ్లిష్‌లో అనువదించారు.
ఆయన ముఖ్యమైన రచనల్లో "సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్" (ఝుఎతీవన దీశీశీఎం శీట్ ష్ట్రవ జుఝర్) ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇది 50 సంపుటాల గ్రంథమాలగా ప్రచురించ బడింది. ఇందులో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బౌద్ధ గ్రంథాలు, జైన గ్రంథాలు, ఇస్లామిక్ మరియు జరస్త్రియన్ గ్రంథాల అనువాదాలు ఉన్నాయి.

ముల్లర్, తులనాత్మక మత శాస్త్రానికి పునాది వేశారు. భిన్న మతాలు, సాంస్కృతిక గ్రంథాల తులనాత్మక విశ్లేషణ చేయడం ద్వారా మానవ సమాజాల ఆధ్యాత్మిక వికాసాన్ని అర్థం చేసుకోవచ్చని విశ్వసించారు. భారతీయ తత్వశాస్త్రం మరియు పాశ్చాత్య తత్వం మధ్య సారూప్యాలను గుర్తించి, రెండు సంస్కృతుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరించారు.

ముల్లర్ ముఖ్యంగా వేదాలను "మానవతా చింతనకు మూలాధారాలు" అని పేర్కొన్నారు. ఆయన దృష్టిలో వేదాలు కేవలం హిందువుల పుణ్య గ్రంథాలు మాత్రమే కాదు, ప్రపంచ మానవాళికి చెందిన ఆధ్యాత్మిక మౌలిక గ్రంథాలు.

ముల్లర్ భారతీయ సంస్కృతిని గౌరవంతో పరిగణించేవారు. "వేదాలు భారతీయుల ఆత్మ" అని పేర్కొంటూ, భారతీయుల ఆధ్యాత్మిక జీవన విధానాన్ని సానుకూల దృక్కోణంతో విశ్లేషించారు. ఆయనకు భారతీయ ధర్మం, తాత్త్విక సూత్రాల పట్ల ఎంతో ఆసక్తి ఉండేది.

అయితే, కొందరు విమర్శకులు ముల్లర్‌పై పాశ్చాత్య వలసవాద దృక్కోణంతో భారతీయ సాహిత్యాన్ని అర్థం చేసుకున్నారని అభిప్రాయ పడ్డారు. ఆయన అనువాదాలు పాశ్చాత్య పాఠకుల కోసం కాస్త మార్పుచేర్పులు చేయబడ్డాయని విమర్శనాత్మకంగా పేర్కొన్నారు.

ముల్లర్ జీవితకాలంలో అనేక కీలక రచనలు చేసారు, వాటిలో కొన్ని ముఖ్యమైనవి: ఋగ్వేదంపై విశ్లేషణ, ఉపనిషత్తుల అనువాదాలు, ప్రాచీన ఆధ్యాత్మిక గ్రంథాల సమాహారం. తాత్త్విక వ్యాసాల సమాహారం.

ముల్లర్ చేసిన అనువాదాలు, విశ్లేషణలు విస్తృతంగా గౌరవించబడ్డప్పటికీ, కొన్ని విమర్శలు ఎదుర్కొన్నాయి. భారతీయ మతసాంప్రదాయాలపై పాశ్చాత్య అర్థాలు రుద్దబడ్డాయని, పాశ్చాత్య పరిశోధనల పట్ల మక్కువతో తాత్త్విక అంశాలను ఒడిసిపట్టాడని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

అయినప్పటికీ, భారతీయ వేద సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించిన ముల్లర్ కృషి చిరస్థాయిగా నిలిచింది.



మాక్స్ ముల్లర్ 1900 అక్టోబర్ 28న మరణించాడు. ఆయన సాహిత్యకృషి భారతీయ సాహిత్య, తాత్విక అధ్యయనాలపై ఎనలేని ప్రభావం చూపింది. భారతీయ వేదాలు, తత్వశాస్త్రాలపై పాశ్చాత్య ఆసక్తి పెరగడానికి ఆయన కృషి దోహద పడింది.

మాక్స్ ముల్లర్ ప్రపంచానికి భారతీయ సంస్కృతిని పరిచయం చేసిన గొప్ప పాశ్చాత్య వేదాంతి. ఆయన చేసిన తాత్త్విక, సాహిత్య కృషి, వేదాలపై చేసిన విశ్లేషణలు భారతీయ, పాశ్చాత్య ప్రపంచాల మధ్య సంస్కృతిక మార్పిడి సాధించాయి. భారతీయ సాహిత్యం, తాత్త్వికతపై ముల్లర్ చూపిన ఆసక్తి, శ్రద్ధకు భారతీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల...
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్,
9440595494

పెన్సిల్ రబ్బర్

జీవితం మోసపోవడం కూడా నేర్పుతుంది
అమ్మనాన్నలు తొలి దశలో నడక నేర్పిస్తారు
జీవిత ఆటుపోట్లు నిలబడడం నేర్పుతాయి !

ఇల్లు, సంపాదన చిన్నవైనా ఫర్వాలేదు
మనసు, సంస్కారం విశాలంగా ఉండాలి
ఇల్లు విశాలం మనసు కురుస ఉండొద్దు !

తన వారి తప్పులను సదా సవరిస్తూనే..
పెన్సిల్ కన్న ముందే అరిగిపోతుంది రబ్బర్
తనోళ్లను సవరిస్తూ జీవిస్తారు త్యాగమయులు !

మనిషికి మనిషికీ ఏదో తెలియని ఘర్షణ..
ఒక మనిషి దగ్గరైతే, మరొకరు దూరమైతే..
ఎంతో అనిర్వచనీయ ప్రశాంతత గొడుగు !

నేడు అన్నింటికీ ధనమే ప్రధానమైంది
గుణం ఉన్నోడికి కనీస గౌరవం పలుచన..
మంచితనాన్ని వదిలి పైసల వెంట పడదామా !

మందు, ప్రేమ రెండూ మత్తును ఇస్తాయి
మందు తాగితే గమ్మత్తుగా నిద్ర ఆవహిస్తుంది
ప్రేమానురాగాలు నిద్రను దూరం చేస్తాయి !

ఎదుటోళ్లను చూసి జీవితాలను పోల్చవద్దు
తోటోళ్ల ముఖమే కనపడుతోంది వీపు కాదు
పీత కష్టాలు పీతవి, ఎవరి రంది వారిదే !

పంటలన్నీ ఒకే బాయి నీటిని తాగుతాయి
కాని కాకర, అరటి, పల్లీ రుచులు వేరు వేరు
రుచికి కారణం నీరు కాదు బీజం మాత్రమే !

సమయం వరకు వేచి ఉండాల్సిందే
నీ సమయం రావడానికి సరైన టైం రావాలి
టైం కలిసొస్తే ఎడారి కూడా హిమ మైదానమే !

మధుపాళీ
9949700037

ఎల్లారెడ్డి అభివృద్ధి బాటలో మరో మైలురాయి

రూ.42.80 కోట్లతో 71.63 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి

మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన



కామారెడ్డి,ప్రతినిధి అక్టోబర్ 27 (సింగిడి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచి, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించాలనే లక్ష్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఏ ఎం) ఫేజ్--1 కింద రూ. 42.80 కోట్ల వ్యయంతో 71.63 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రామారెడ్డి మండల పరిధిలోని పోసానిపేట, రంగంపేట గ్రామాల సరిహద్దులో ఉన్న మోషంపూర్ చౌరస్తా వద్ద రహదారి పనులకు పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ శంకుస్థాపన చేశారు.

రూ. 4.70 కోట్లతో రహదారి నిర్మాణం

హెచ్ ఏ ఎం ఫేజ్--1లో భాగంగా జాతీయ రహదారి--44 నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డి మీదుగా మోషంపూర్ వరకు 6.40 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధి పనులను రూ. 4.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. ఈ పనులకు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ శంకుస్థాపన చేయడంతో రహదారి నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ రహదారి అభివృద్ధి పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకునేందుకు, వ్యాపారులు తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమై, ప్రయాణ సమయం కూడా తగ్గే అవకాశం ఉంది.

గ్రామీణ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే గ్రామీణ ప్రజలకు విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి దోహదపడనుంది. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చనున్నాయి. ముఖ్యంగా అంతర్గత గ్రామీణ రహదారుల అభివృద్ధితో మారుమూల ప్రాంతాల ప్రజలకు రవాణా పరంగా ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయి.

అభివృద్ధి పనులపై ప్రజల్లో ఆశలు

రహదారుల అభివృద్ధి పనులు నిర్ణీత ప్రమాణాలతో, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ పూర్తిచేయాలని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు. ప్రతిపాదించిన పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఊతం లభించనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లలితాపూర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం, ఫారం పాండ్ పనులు ప్రారంభం



మానకొండూర్,అక్టోబర్27(సింగిడి): లలితాపూర్ గ్రామంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రెండు ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పుల్లూరి శారద–శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రముఖ కంటి ఆసుపత్రి 'డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్' వారి సౌజన్యంతో గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు, సలహాలు అందించారు. మరొక వైపు, గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే ఉద్దేశంతో 'జలసిరి' పథకంలో భాగంగా అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో భాగంగా లలితాపూర్ గ్రామానికి చెందిన రైతు సామాకూరి అనంత్ రెడ్డి వ్యవసాయ భూమి వద్ద ఇండివిడ్యుఅల్ ఫారం ఫాండ్ వ్యక్తిగత రైతు పంట కుంట నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో లలితాపూర్ గ్రామ ఉప సర్పంచ్ మర్రి కుమారస్వామి, పంచాయతీ సెక్రటరీ జీవిత, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించే ఆయుధం విద్యే



- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమం
- ప్రముఖ రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కరీంనగర్, అక్టోబర్27(సింగిడి): పేదరికాన్ని అధిగమించి ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యే ప్రధాన ఆయుధమని ప్రముఖ రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కెరీర్ మార్గదర్శక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. పేదరికం నుంచి ఎదిగి దేశానికి సేవలందించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పదో తరగతి తర్వాత భవిష్యత్తుకు ఉపయోగపడే విద్యా మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా శిక్షకులు డాక్టర్ శ్రీనివాస్, గణేశ్ విద్య ప్రాధాన్యం, తల్లిదండ్రుల పాత్రను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని సత్కరించారు. ఆయన రచించిన క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ పుస్తకాన్ని పాఠశాల గ్రంథాలయానికి బహూకరించారు.

బాలల భద్రతకు పోక్సో చట్టం రక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు, వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

న్యాయమూర్తులు జె. వెంకట సత్యరాజ్ కిరణ్



కరీంనగర్, అక్టోబర్ 27 (సింగిడి) : బాలలపై లైంగిక నేరాల నివారణ, వారి హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సురక్షిత బాల్యం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టం 2012, వ్యక్తిగత భద్రత, బాలల హక్కులపై న్యాయమూర్తులు అవగాహన కల్పించారు. కరీంనగర్‌లోని పురాతన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయమూర్తి దామెర్ల ప్రీతి, కుమ్మరివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయమూర్తి జె. వెంకట సత్యరాజ్ కిరణ్, డాక్టర్స్ స్ట్రీట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయమూర్తి బానోత్ రాజేశ్వర్ విద్యార్థులకు సూచనలు చేశారు. లైంగిక వేధింపులు, బెదిరింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని న్యాయమూర్తులు సూచించారు. వ్యక్తిగత భద్రతను కాపాడుకోవడం, అనుచిత ప్రవర్తనను గుర్తించడం, బాధితుల గోప్యతను గౌరవించడం వంటి అంశాలను వివరించారు. సహాయం కోసం బాలల హెల్ప్‌లైన్ 1098, అత్యవసర పరిస్థితుల్లో 112ను సంప్రదించాలని తెలిపారు. బాధితులకు అవసరమైన వైద్య, మానసిక, న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. బాలలు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ తెలిపారు. కార్యక్రమాల్లో న్యాయవాదులు, న్యాయ సహాయ న్యాయవాదులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలల రక్షణ అధికారులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

పిల్లలు కలగడం లేదనే కారణంతో ఘాతుకం

తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడి పట్టివేత

రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి



కరీంనగర్, అక్టోబరు 27 (సింగిడి): పిల్లలు కలగడం లేదనే కారణంతో భార్య స్వరూపను గొంతు పిసికి హత్య చేసిన కేసులో నిందితుడు దావు చంద్రకుమార్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న అతడిని మంగళవారం ఉదయం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం. మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న చంద్రకుమార్ పిల్లలు కలగడం లేదనే కారణంతో భార్యకు విడాకులు ఇవ్వాలని ప్రయత్నించాడు. ఇందుకు ఆమె, ఆమె తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో హత్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నెల 25వ తేదీ రాత్రి మద్యం సేవించిన చంద్రకుమార్.. భార్యను తీసుకెళ్లాలని ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. వారు రాకపోవడంతో ఆగ్రహానికి గురై, రాత్రి 11.30 గంటల సమయంలో అద్దె ఇంటిలో నిద్రిస్తున్న స్వరూప గొంతు పిసికి హత్య చేసినట్లు పోలీసులకు తెలిపాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వేరే ప్రాంతానికి వెళ్లి తలదాచుకునేందుకు రైలు ఎక్కాలని తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చిన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తదుపరి విచారణ చేపట్టి, న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళల విజ్ఞప్తికి ఎమ్మెల్యే స్పందన.. రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం

మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



కామారెడ్డి అక్టోబర్ 27 (సింగిడి): మహిళా సంఘాల అభ్యర్థనకు స్పందించి, ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ మహిళల మన్ననలు పొందారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సమాఖ్య భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ మంగళవారం ప్రారంభించారు.

మహిళల అవసరాన్ని గుర్తించి హామీ అమలు

పోసానిపేట్ గ్రామానికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ సంఘు కార్యకలాపాలను నిర్వహించుకోవడానికి ప్రత్యేక భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను కలిసి తమ సమస్యను వివరించి, మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మహిళల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ. 10 లక్షల నిధులతో భవన నిర్మాణం పూర్తికావడంతో మంత్రి సీతక్కతో కలిసి ఆయన ప్రారంభించారు.

మహిళా సంఘాలకు మరింత ఊతం

నూతన భవనం అందుబాటులోకి రావడంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, పొదుపు కార్యక్రమాలను కొనసాగించడానికి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకోవడానికి సౌకర్యం కలగనుంది. మహిళలు సంఘటితంగా ముందుకు సాగడంతోపాటు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ భవనం దోహద పడనుంది. గ్రామానికి విచ్చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తమ విజ్ఞప్తిని గుర్తించి భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామీణ మహిళల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించనుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ, పునరావాసం

7 రోజుల్లో సామాజిక ప్రభావ అంచనా సర్వే పూర్తి

4 నెలల్లో పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ పూర్తి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 27 (సింగిడి): ధర్మారం మండలం చామనపల్లి గ్రామ ప్రజల ఏళ్ల నాటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టి నిబంధనల ప్రకారం పునరావాస (ఆర్‌అండ్‌ఆర్) ప్యాకేజీ అమలు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మారం మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభలో మంత్రి మాట్లాడారు. సాధారణంగా నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) నుండి 100 మీటర్ల పరిధిలోనే భూసేకరణ జరుపుతారు. అయితే గ్రామస్థుల సమస్యను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తొలిసారిగా గ్రామం మొత్తానికి భూసేకరణ చేపడుతున్నామని అన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ గ్రామంలోని ఇళ్లు, చెట్లు, బావులు, కలప వివరాలతో ఇప్పటికే ప్రాథమిక అంచనాలు వేశామన్నారు. సామాజిక ప్రభావ అంచనా సర్వే కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వీడియో రికార్డింగ్‌తో ప్రతి ఇంటికి ప్రాజెక్టు నంబరు కేటాయించి 7 రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ కమిటీ ద్వారా గ్రామస్థుల పునరావాస స్థలాల ఎంపిక, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంశాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాబోయే 3 నుండి 4 నెలల్లో పరిహారం, పునరావాస ప్రక్రియను పూర్తి చేస్తామని, నిబంధనలపై అవగాహన కోసం ఆర్డీవో బి.గంగయ్య, తహసీల్దార్లు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ,ఆర్డీఓ గంగయ్య తహసీల్దార్ శ్రీనివాస్,సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా... ప్రజలే ప్రేరణగా.. సామాజిక సేవ..

ఆదర్శంగా నిలుస్తున్న కె.వి.ఆర్ ఫౌండేషన్ సంస్థ...

సిద్దిపేటలో ఘనంగా కల్వకుంట్ల వంశీధర్ రావు జన్మదిన వేడుకలు



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 27, (సింగిడి): పుట్టినరోజు వేడుకలు అంటే కేక్ కటింగ్‌లు, అభినందనలు, ఆడంబరాలకే పరిమితం కాకుండా.. నలుగురికి మేలు చేసే సేవా కార్యక్రమాలకు వేదికగా మారితే ఆ వేడుకలకు మరింత ప్రత్యేకత చేకూరుతుంది. అదే స్ఫూర్తితో కె.వి.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు 53వ జన్మదిన వేడుకలు సిద్దిపేట పట్టణంలో ఘనంగా జరిగాయి. అభిమానుల సందడి మధ్య నిర్వహించిన ఈ వేడుకల్లో రక్తదానం, అన్నదానం, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సేవా స్ఫూర్తి గా నిలిచిన జన్మదిన వేడుకలు

సిద్దిపేట పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన జన్మదిన వేడుకలకు అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కె.వి.ఆర్ ఫౌండేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, చిన్నకోడూరు, నారాయణరావుపేట మండల కేంద్రాల్లోనూ కేక్ కటింగ్ కార్యక్రమాలు జరిగాయి. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కె.వి.ఆర్ సేన సభ్యులు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, వంశీధర్ రావు సైతం రక్తదానం చేసి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

విద్య, ఉపాధికి చేయూత

కె.వి.ఆర్ ఫౌండేషన్ ద్వారా కొనసాగుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఈ వేడుకల సందర్భంగా మరోసారి చర్చనీయాంశమయ్యాయి. విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్స్ అందించడంతో పాటు మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, నిరుద్యోగ యువతకు డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్నట్లు కల్వకుంట్ల వంశీధర్ రావు తెలిపారు. విద్యార్థులకు విద్యా పరమైన సహకారం అందించడం, మహిళలకు నైపుణ్య శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి సాధనలో తోడ్పడటం వంటి కార్యక్రమాలు సమాజంలో వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడతాయని ఫౌండేషన్ లక్ష్యాలు సూచిస్తున్నాయి. సేవా కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజల అభిమానం.. మరింత బాధ్యత

జన్మదిన వేడుకల్లో భాగంగా భారీ కేక్ కట్ చేయగా, అభిమానులు వంశీధర్ రావును గజమాలతో, ఖడ్గంతో, శాలువాలతో సత్కరించారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలు సంతోషాన్ని కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజల నుంచి లభించే ఆదరణ మరింత బాధ్యతను పెంచుతుందని, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవాలన్నదే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

వేడుకలకే పరిమితం కాకుండా.. సేవలో కొనసాగాలి

సమాజంలో విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి రంగాల్లో అవసరమైన వారికి తోడ్పాటు అందించడం స్వచ్ఛంద సంస్థల ప్రధాన లక్ష్యం. ఆ దిశగా కె.వి.ఆర్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించి, అవసరమైన వారికి నిరంతర ప్రయోజనం చేకూర్చాలని పలువురు ఆకాంక్షించారు. ఒక వ్యక్తి జన్మదినం సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తూ, సామాజిక బాధ్యతను గుర్తుచేసే సందర్భాలుగా నిలవాలి. అభిమానుల కోలాహలం మధ్య జరిగిన కల్వకుంట్ల వంశీధర్ రావు జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాల సమాహారంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కన్నారావుతో పాటు కె.వి.ఆర్ ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అయ్యాల రవి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శ

- దేశాయిపేట్‌లో మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 27 (సింగిడి): గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన అయ్యాల రవి తల్లి నాలుగు రోజుల క్రితం మృతి చెందడంతో, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలోని అయ్యాల రవి నివాసానికి వెళ్లిన ఆయన, మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తల్లి మృతితో బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం...

మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు.. 500 బోనస్

ప్రభుత్వ విప్ విజయరమణ రావు....



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 27 (సింగిడి) : సాగునీరు మద్దతు ధర విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు రైతులను కోరారు.
మంగళవారం సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో ఐకేపీ సింగిల్ విండో కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ రైతులకు క్వింటాల్ వడ్లకు రూ. 2,462 మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ కలిపి మొత్తం రూ. 2,962 అందిస్తున్నామని ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబుల సహకారంతో 10 రోజులు ఎస్సారెస్పీ నీరు ఇప్పించి నియోజకవర్గంలో పంటలు ఎండకుండా కాపాడామని అన్నారు. కొనుగోలు కేంద్రం తూకాల్లో ఇబ్బంది పెడితే కేంద్రాల ఇన్‌చార్జీలను తొలగిస్తామని హెచ్చరించారు. తుఫాను నేపథ్యంలో ధాన్యంపై పాలిథిన్ కవర్లు కప్పుకోవాలని అన్నారు.సూపర్ ఎల్ నీనో ప్రభావం వల్ల వేసవిలో వరికి బదులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లు మార్కెట్ కమిటీ చైర్మన్ లు, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ లీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



(ఉమ్మడి నల్గొండ బ్యూరో) అక్టోబర్ 27 (సింగిడి): మంగళవారం బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి రీసర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. రీసర్వే పనులను మరింత కచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. రీసర్వే బృందాలకు గ్రామస్థులు, రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆస్తిపన్ను వసూళ్లు, భువన్ సర్వే వేగవంతం చేయాలి



- పెండింగ్ ఆస్తుల సర్వే ప్రారంభించాలి
- పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్, అక్టోబర్27(సింగిడి): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నుల వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు, పెండింగ్ ఆస్తుల భువన్ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు సూచనలు చేశారు. పురపాలక పరిపాలన సంచాలకుల ఆదేశాల మేరకు గురువారం నుంచి పెండింగ్ ఆస్తుల సర్వే ప్రారంభించాలని, సంబంధిత యజమానులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి భవనాల ఛాయాచిత్రాలు, అవసరమైన పత్రాలను నమోదు చేయాలని సూచించారు. నివాస, వాణిజ్య ఆస్తుల పన్నులతో పాటు నగరపాలక సంస్థ దుకాణాల అద్దెలను కూడా లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో వసూలు చేయాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భువన్ సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణానికి అనుగుణంగానే ఆస్తిపన్ను కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. అదనపు నిర్మాణాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పన్ను సవరణ చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అయాజ్, ఉప కమిషనర్లు వేణు మాధవ్, ఖాదర్ మొహియుద్దీన్, రెవెన్యూ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యం

కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అకాంక్ష యాదవ్





ఉమ్మడి నల్గొండ బ్యూరోఅక్టోబర్ 27 (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భువనగిరి పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ్ జయంతి ఐఏఎస్ గారు, జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ గారు, అదనపు ఎస్పీ శ్రీ లక్ష్మీనారాయణ గారు ర్యాలీలో పాల్గొన్నారు. భువనగిరి మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా కొనసాగి భువనగిరి రైల్వే స్టేషన్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు, రవీందర్, సురేష్, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ్ జయంతి ఐఏఎస్ గారు, జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ గారు మాట్లాడుతూ.. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల్లో పోలీస్ శాఖ పట్ల అవగాహన, గౌరవం పెంపొందించడంతో పాటు పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో ప్రజలు, యువత, విద్యార్థులు భాగస్వాములై పోలీసు అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పించాలని వారు పిలుపునిచ్చారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్టోబర్ 27 (సింగిడి): జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన బాండెడ్ లేబర్ విజిలెన్స్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఇటుక బట్టీలు, పరిశ్రమలు, పౌల్ట్రీ ఫారాలు, స్టోన్ క్రషర్లు తదితర ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా వెట్టిచాకిరీ జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే కేసులు నమోదు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్మికులకు కనీస వసతులు కల్పించకుండా, కనీస వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కార్మికుల హక్కులను కాపాడటంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకా రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ పి. అరుణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజు, ఎల్‌డీఎం, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీడబ్ల్యూఓ శ్రీనివాస్, చౌటుప్పల్ ఆర్డీఓ, భువనగిరి ఇన్‌స్పెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పాల్గొన్నారు.

రైతులపై మార్కెట్ ఫీజు భారం లేదు!

వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుపై ఒక శాతం ఫీజు వ్యాపారులే చెల్లించాలి

లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు

జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య స్పష్టం



కామారెడ్డి, అక్టోబర్ 27 (సింగిడి): వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులే నిబంధనల ప్రకారం మార్కెట్ ఫీజు చెల్లించాలని, రైతుల నుంచి ఎలాంటి మార్కెట్ ఫీజు వసూలు చేయరాదని కామారెడ్డి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య స్పష్టం చేశారు. మార్కెట్ ఫీజు చెల్లింపు విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. జిల్లాలోని పది వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో రైతులు తమ పంటలను బహిరంగ మార్కెట్లో ఎక్కడైనా విక్రయించుకోవచ్చని తెలిపారు.

ఇతర రాష్ట్రాల వ్యాపారుల నుంచి పెరుగుతున్న డిమాండ్

ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తగ్గిన నేపథ్యంలో తెలంగాణలో పండిన పంటలకు ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరిగిందని రమ్య వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధరల కంటే కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కామారెడ్డి జిల్లాకు వచ్చి రైతుల నుంచి నేరుగా లేదా మధ్యవర్తుల ద్వారా పంటలను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కామారెడ్డి, భిక్కనూరు, గాంధారి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో జరిగే కొనుగోళ్లకు సంబంధించి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

కొనుగోలు విలువపై ఒక శాతం ఫీజు

వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారులు, కొనుగోలు చేసిన ఉత్పత్తుల విలువపై నిబంధనల ప్రకారం ఒక శాతం మార్కెట్ ఫీజును సంబంధిత మార్కెట్ కమిటీలకు చెల్లించాల్సి ఉంటుందని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి స్పష్టం చేశారు. ఈ బాధ్యత కొనుగోలు చేసే వ్యాపారులదేనని, రైతులపై ఈ ఫీజు భారం వేయడం సరికాదని పేర్కొన్నారు. మార్కెట్ ఫీజు చెల్లింపుపై కొందరు మధ్యవర్తులు, దళారులు రైతులకు తప్పుడు సమాచారం అందిస్తూ అపోహలు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కనీస మద్దతు ధర ఆధారంగానే మార్కెట్ ఫీజు చెల్లిస్తామంటూ తనిఖీ కేంద్రాలు, తనిఖీ పాయింట్ల వద్ద మార్కెటింగ్ శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగడం సమంజసం కాదని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, మార్కెట్ ఫీజు చెల్లింపు విషయంలో వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. మధ్యవర్తులు, దళారులు చెప్పే అవాస్తవ సమాచారాన్ని నమ్మి అయోమయానికి గురికావద్దని కోరారు.

లైసెన్సులు లేకుంటే చర్యలు తప్పవు

వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి అవసరమైన లైసెన్సులు పొందకుండా వ్యాపారం నిర్వహిస్తున్న మధ్యవర్తులు, దళారులు వెంటనే సంబంధిత మార్కెట్ కమిటీలు లేదా మార్కెటింగ్ శాఖను సంప్రదించి లైసెన్సులు పొందాలని రమ్య సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అవసరమైన లైసెన్సులు లేకుండా, నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యాపారం కొనసాగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్లలో పారదర్శకమైన వ్యాపార లావాదేవీలు జరిగేలా వ్యాపారులు, మధ్యవర్తులు సహకరించాలని కోరారు. రైతులకు మార్కెట్ ఫీజుపై స్పష్టత కల్పించడంతో పాటు, అక్రమ వ్యాపార కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు మార్కెటింగ్ శాఖ నిబంధనల అమలుపై దృష్టి సారించనుంది.

ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలు సడలించాలి

మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు సదాశివనగర్ సర్పంచ్ వినతి



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 27 (సింగిడి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం విధించిన కొన్ని నిబంధనల కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలను సడలించాలని సదాశివనగర్ గ్రామ సర్పంచ్ వంకాయల శిరీష రవి కోరారు. ఈ మేరకు మంగళవారం సదాశివనగర్ గ్రామానికి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ లెటర్ హెడ్‌పై వినతిపత్రాన్ని అందజేశారు.

ఇంటి నిర్మాణ విస్తీర్ణం పెంచాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని సర్పంచ్ పేర్కొన్నారు. అయితే, ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న కొన్ని నిబంధనలు లబ్ధిదారులకు ఇబ్బందికరంగా మారుతున్నాయని వివరించారు. ఇంటి నిర్మాణ విస్తీర్ణాన్ని ప్రస్తుత పరిమితుల నుంచి 600 నుంచి 700 చదరపు అడుగుల వరకు పెంచే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇంటి చుట్టూ, ముందు భాగంలో నిర్దేశించిన ఖాళీ స్థలం నిబంధనల విషయంలోనూ లబ్ధిదారులకు వెసులుబాటు కల్పించాలని కోరారు. స్థలాల విస్తీర్ణం, అందుబాటులో ఉన్న భూమిని బట్టి ఇళ్ల నిర్మాణానికి అనుమతించేలా నిబంధనలను సరళీకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకుంటున్న పేద కుటుంబాలకు నిబంధనలు అడ్డంకిగా మారకూడదని సర్పంచ్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే అయినప్పుడు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేయాలని కోరారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజల పక్షాన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ ఉపసర్పంచ్ ప్రవీణ్, గ్రామ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్, నరేంద్రమోడీ ఓటు దొంగతనం పై సమరానికి సన్నద్ధం

నవంబర్ 1న లక్షలాదిగా ఢిల్లీకి తరలి వెళ్దాం ఓటును కాపాడుకుందాం

ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్టోబర్ 27 (సింగిడి): ఓట్ల దొంగతనానికి పాల్పడ్డ ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీల పై రాహుల్ గాంధీ ఇచ్చిన సమర శంఖ పిలుపుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వివేరా హోటల్లో మంగళవారం నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య అధ్యక్షతన యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఓటు హక్కు ను పరిరక్షించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓటు బచావో... దేశ్ బచావో ఉద్యమం నవంబర్ 1న ఢిల్లీ రాంలీల్ మైదానంలో జరుగుతున్న నేపథ్యంలో వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం సర్ ప్రక్రియ పేరిట ప్రజల ఓటు హక్కును దెబ్బతీస్తుందని ఎమ్మెల్యే కుంభం ఆరోపించారు. సర్ అంటే ఓటు నమోదు చేసుకునే కార్యక్రమం కాదు ఓట్లను తొలగించే కార్యక్రమం అని విమర్శించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు అంటూ ఎన్నికల కమిషన్ లోని సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఇప్పటికే ఉన్న ఓట్లను తొలగించి మళ్లీ ఓటు నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందని అన్నారు. మరోసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావాలని లక్ష్యంతో ఓట్ల చోరీకి పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకుల ఆరోపించారు. ఓటు హక్కుపరిరక్షణ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ప్రజాస్వామ్య విలువల సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐలయ్య అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఓటు హక్కును హరించే ప్రయత్నాలను ప్రజాస్వామ్య వాదులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. ఖమ్మం..వరంగల్...నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించేందుకు నాయకులు కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని బిర్లా ఐలయ్య కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు శ్రీరాం భూపాల్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు వినోద్ రెడ్డి, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పార్టీ సీనియర్ నాయకులు పి ప్రమోద్ కుమార్, అండెం సంజీవరెడ్డి, తంగళ్ళపల్లి రవికుమార్, పార్టీ నాయకులు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, జిల్లా పార్టీ నాయకులు పిసిసి నెంబర్లు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం.. ఎమ్మెల్యే



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్టోబర్ 27 (సింగిడి): నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కో-ఆర్డినేటర్లతో ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి కార్యకర్తలు చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించి, ఎవరూ నమోదు అవకాశాన్ని కోల్పోకుండా కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా రాజయ్య ప్రధాన కార్యదర్శిగా కందుల శంకర్



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్టోబర్ 27 (సింగిడి): రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా ఎలగల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా కందుల శంకర్ రెండోసారి ఎన్నికయ్యారు. మంగళవారం నాడు గజ్వేల్ లో జరిగిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నాయ కోటి రాజు ప్రమాణస్వీకారం చేశారు. రెండోసారి తమకు రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినందుకు ఎలుగుల రాజయ్య, కందుల శంకర్ ధన్యవాదాలు తెలిపారు. రెండోసారి రాష్ట్ర కార్యవర్గంలో స్థానం సంపాదించిన వారిద్దరికీ జిల్లా డీలర్ల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదానం

స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువకులు

అమరవీరులకు ఘన నివాళి



జమ్మికుంట, అక్టోబర్ 27 (సింగిడి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని హుజూరాబాద్ పట్టణంలో గల క్లబ్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వాసంశెట్టి మాధవి మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. యువత సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ అమరవీరులకు నివాళులర్పించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఇదే కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు పాతకాల ప్రవీణ్ తన మిత్రబృందంతో కలిసి రక్తదానం చేశారు. జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ పిలుపు మేరకు శిబిరంలో పాల్గొన్న ఆయనను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, వెంకట్, ఎస్సైలు రవి, కృష్ణారావు, శేఖర్ రెడ్డి, తిరుపతి, క్రాంతి, స్వాతి, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, సుజాత, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో కాదు.. చేతల్లో చూపించిన సర్పంచ్ రవికుమార్..!!

ఏళ్ల నిరీక్షణకు తెర.. జామా మసీద్‌కు సీసీ రోడ్డు నిర్మాణం!

మౌలిక సదుపాయాల కల్పనలో ముందడుగు..

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు, సర్పంచ్‌కు కృతజ్ఞతలు



గోదావరిఖని అక్టోబర్ 27 (సింగిడి): అంతర్గాం మండలంలోని జామా మసీద్‌కు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ముస్లిం సోదరుల చిరకాల ఇబ్బందులకు పరిష్కారం లభించింది. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు సదుపాయం లేక మసీదుకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులకు సీసీ రోడ్డు నిర్మాణం ఉపశమనం కలిగించింది.స్థానికుల అవసరాలను గుర్తించి సీసీ రోడ్డు వేయించడంలో అంతర్గాం సర్పంచ్ ఆంబోతు రవికుమార్ చొరవ తీసుకోవడంపై ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు, అంతర్గాం సర్పంచ్ ఆంబోతు రవికుమార్‌కు ముస్లిం సోదరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ రోడ్డు సదుపాయాన్ని కల్పించడంతో స్థానికంగా సర్పంచ్‌పై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షేమమే లక్ష్యం.. అర్హుల పక్షాన కార్పొరేటర్ సూర్య..!!

41వ డివిజన్‌లో 15 మందికి ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

తదుపరి విడతలోనూ అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తా: 41 డివిజన్ కార్పొరేటర్ సూర్య



గోదావరిఖని అక్టోబర్ 27 (సింగిడి): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు 41వ డివిజన్ కార్పొరేటర్ సూర్య తెలిపారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా, పారదర్శక విధానంలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందని పేర్కొన్నారు.ఈ క్రమంలో 41వ డివిజన్‌కు చెందిన 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మేయర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన లబ్ధిదారులకు మరుసటి రోజు నేరుగా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.డివిజన్‌లో సొంత ఇల్లు నిర్మించుకోవాలనే ఆశయం ఉన్న అర్హులైన పేదలు తనను నేరుగా సంప్రదించాలని కార్పొరేటర్ సూర్య సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల తదుపరి విడతలో అర్హులకు మంజూరు లభించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

మటన్ బోటి, గోంగూర..

ఈ కాంబినేషన్‌తో ఆ సమస్యలన్నీ మటుమాయం

నాన్ వెజ్ ప్రియులు మటన్ బోటిని ఎంతో ఇష్టంగా తింటారు. మేక ప్రేగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయని డైటీషియన్లు కూడా చెబుతున్నారు. బోటీలో వీటిలో ఐరన్, జింక్, విటమిన్లు సమృద్ధిగా ఉండి, రక్తహీనతను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.. ఇన్ని పోషకాలున్న మటన్ బోటిని చాలా మంది.. ఇష్టంగా వండుకుని తింటారు.. కొందరు బోటిని ఫ్రై, కూర చేసుకుంటారు.. మరికొందరు..
బోటిలో గోంగూర వేసి వండుతారు.. గోంగూర బోటి కూర అనేది
తెలుగు రాష్ట్రాలలో బాగా ప్రాచుర్యం పొందిన.. ప్రత్యేకమైన రుచిని అందించే వంటకం.. పుల్లగా.. ఎంతో రుచిగా ఉండే ఈ వంటకాన్ని సులభమైన పద్ధతిలో ఇంట్లోనే తయారు చేసుకోని తినవచ్చు.. ఈ కూర అన్నం, చపాతీ, రోటీలు, అలాగే పలావ్ లేదా బిర్యానీ వంటి వాటితో చాలా అద్భుతంగా ఉంటుంది..



గోంగూర బోటి రెండూ కలపడం వల్ల పోషక విలువలు మరింత పెరుగుతాయి.. గోంగూర బోటి కర్రీలో గోంగూర వల్ల ఐరన్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. బోటిలో ప్రోటీన్లు, జింక్, మెగ్నీషియం ఉండటం వల్ల శక్తినిచ్చి, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది, మొత్తంగా ఈ కర్రీ పోషకాలతో నిండి ఉంటుంది, కానీ మితంగా తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

గోంగూరలో విటమిన్‌ఆ, జ, దీ కాంప్లెక్స్, ఐరన్, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్ వంటివి పుష్కలంగా ఉంటాయి.. ఇవి రక్తహీనతను నివారించి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడతాయి. ఇంకా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కాలేయ పనితీరుకు మద్దతు ఇస్తుంది. బోటి (మటన్ పేగు)లో ప్రోటీన్లు, పొటాషియం, జింక్, మెగ్నీషియం ఉంటాయి.. ఇవి శరీరానికి శక్తినిచ్చి, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడతాయి..

గోంగూర బోటి తయారీ విధానం..

మొదట బోటీని వేడి నీటితో శుభ్రంగా కడిగి, చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ప్రెషర్ కుక్కర్?లో బోటీని పసుపు, ఉప్పు, నీరు కలిపి 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఉడికిన బోటీ నుండి నీటిని తీసివేయాలి. తరువాత, రెండు గుప్పెళ్ల శుభ్రం చేసిన గోంగూరను పావు కప్పు నీటితో ఒక పాన్?లో వేసి, మెత్తగా ఉడికే వరకు కుక్ చేసుకోవాలి. గోంగూర ఉడికిన తర్వాత చల్లారనివ్వాలి. ఒక పాన్?లో నూనె వేడిచేసి, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. పసుపు, ఉప్పు, ఉడికించిన బోటీ ముక్కలు, టమాటా ముక్కలు, కారం, ధనియాల పొడి, గరం మసాలా వేసి బాగా కలిపి ఒక నిమిషం పాటు వేయించుకోవాలి. తరువాత రెండు కప్పుల నీరు పోసి, మూత పెట్టి 5-6 నిమిషాలు ఉడికించాలి. చివరగా, ఉడికించిన గోంగూర మిశ్రమాన్ని చేర్చి, 10 నిమిషాలు ఉడికించి కొత్తిమీరతో గార్నిష్ చేయాలి. ఈ రుచికరమైన గోంగూర బోటి కూరను అన్నం, చపాతీ లేదా రోటీలతో వేడివేడిగా సర్వ్ చేసుకోవచ్చు.



ఖరీదైన మేకప్ అవసరం లేదు..

ప్రతిరోజు ఉదయం ఈ 4 పనులు చేస్తే అందమైన, మృదు

అందమైన చర్మం కోసం చాలా మంది మార్కెట్లో వివిధ ఉత్పత్తులను ఉపయోగిస్తారు. అవన్నీ తత్కాలికంగా అందాన్ని పెంచుతాయి. కానీ, కొన్నిసార్లు ఇది చర్మానికి హాని కలిగిస్తుంది.అయితే, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేయడం ద్వారా, మీరు మీ ముఖాన్ని సహజంగా ప్రకాశవంతం చేసుకోవచ్చు. దీని కోసం, మీరు డబ్బు ఖర్చు చేయవలసిన అవసరం లేదు. ఎక్కువ సమయం కూడా పట్టదు. మీరు ప్రతిరోజూ నిద్రలేచిన వెంటనే ఈ నాలుగు అలవాట్లను పాటిస్తే, మీ చర్మం సహజమైన మెరుపును పొందుతుంది.



మీ ముఖాన్ని సహజంగా ప్రకాశవంతం చేసుకోవడానికి ఈ 4 పనులు చేయండి:

ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి:

మీరు ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన వెంటనే మీ ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. ఈ సందర్భంలో, రసాయన ఆధారిత ఫేస్ వాష్?లను ఉపయోగించే బదులు, మీ ముఖాన్ని శుభ్రం చేసుకోవడానికి తేలికపాటి ఫేస్ వాష్ లేదా క్లెన్సర్?ను కూడా ఉపయోగించవచ్చు. వీలైతే, సహజ ఉత్పత్తులను వాడండి. ఇది మీకు ప్రకాశవంతమైన, అందమైన చర్మాన్ని ఇస్తుంది.

టోనింగ్:
ముఖం కడుక్కున్న తర్వాత టోనింగ్ చాలా ముఖ్యం. దీని కోసం మీరు రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. ముఖం కడుక్కున్న తర్వాత రోజ్ వాటర్ ను ముఖానికి అప్లై చేయడం వల్ల మీ చర్మాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా, చర్మపు మచ్చలను తగ్గించి సహజమైన మెరుపును ఇస్తుంది.

సీరం:
మీ ముఖానికి టోనర్ రాసి, సీరం వేసుకునే ముందు రెండు నిమిషాలు అలాగే ఉంచండి. దీని కోసం విటమిన్ సి అధికంగా ఉండే సీరం వాడటం మంచిది. ఇది మీ చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తుంది. చర్మాన్ని లోపలి నుండి పోషిస్తుంది. క్రమంగా చర్మం మెరుపును పెంచుతుంది.

మాయిశ్చరైజర్:
మీ ముఖానికి సీరం అప్లై చేసి, కొన్ని నిమిషాల తర్వాత మాయిశ్చరైజర్ అప్లై చేయండి. ఇది మీ ముఖాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా మార్చడంలో ప్రభావవంతంగా ఉంటుంది.
ఈ నాలుగు చర్మ సంరక్షణ పద్ధతులను ప్రతిరోజూ పాటించడం వల్ల మీ ముఖ సౌందర్యం సహజంగా పెరుగుతుంది. మీరు ఇంటి నుండి బయటకు వెళ్ళిన ప్రతిసారీ సన్?స్క్రీన్ అప్లై చేయడం మర్చిపోవద్దు. ఎందుకంటే సూర్యుని హానికరమైన కిరణాలు మీ చర్మాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి, ఇంటి నుండి బయటకు వెళ్ళే ముందు మీ ముఖానికి సన్‌స్క్రీన్ అప్లై చేయండి.



పసిడి ప్రియులకు బ్యాడ్ న్యూస్..

మళ్లీ పేలిన బంగారం ధరలు..

ఇవాళ తులం ఎంతంటే..?

బంగారం ధరల తగ్గుదలకు బ్రేక్ పడింది. దీపావళి పండక్కి ముందే పసిడి ధరలు పెరుగుతూ గోల్డ్ ప్రియు లకు చేదు వార్తను అందిస్తున్నాయి. సోమవారం నుంచి ధరలు పెరుగుదల ప్రారంభమవ్వగా.. మంగళవారం కూడా దేశీయ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు పుంజుకు న్నాయి. అక్టోబర్ 27న దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు ప్రస్తుతం రూ. 1,43,290 వద్ద కొనసా గుతోం డగా.. ఇవాళ ఒక్కరోజే రూ. 540 పెరుగుదల నమోదు చేసింది. ఇక 22 క్యారెట్ల రేటు ఇవాళ రూ. 1,31,350గా ఉండగా.. నేడు రూ. 500 మేర పెరి గింది. విజయవాడ, విశాఖపట్నం లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 1,43,440 వద్ద ట్రేడవుతుండగా.. ఇవాళ ఒక్కరోజే రూ. 540 పెరిగింది. ఇక 22 క్యారెట్ల రేటు రూ. 1,31,500 వద్ద కొనసాగుతోండగా.. నేడు రూ. 500 మేర పెరిగింది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ. 1,43, 290 పలుకుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ. 1,31,350కి లభిస్తోంది.

ఇక బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,43,290 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ. 1,31,350కి చేరుకుంది. అటు వెండి ధరలు మాత్రం భిన్నంగా కొనసాగుతున్నాయి. సిల్వర్ రేట్లు స్థిరంగా ఉన్నాయి. బెంగళూరులో కిలో వెండి రూ. 2. 20 లక్షల వద్ద కొనసాగుతోంది. హైదరాబాద్‌లోనూ రూ. 2. 20 లక్షలుగా ఉంది.

త్వరలో దీపావళి పండుగ రానున్న క్రమంలో డిమాండ్ వల్ల బంగారం ధరలు పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. పండుగ వరకు ఇదే పెరుగుదల ఉండే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే గోల్డ్ రేట్లలో ఊహించని పరిణామంతో కొనుగోలుదారులు నిరాశ చెందుతున్నారు. పండక్కి బంగారం కొనుగోలుచేసేవారిపై ఇది ప్రభావం చూపనుంది.

రూ.వెయ్యి నోట్లు మళ్లీ వస్తున్నాయా..?

అసలు విషయం ఇదే.. కేంద్రం నుంచి క్లారిటీ..



నోట్ల రద్దు సమయంలో కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి నోట్లను చలామణి నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఈ నోట్లను ఆర్బీఐ వెనక్కి తీసుకుంది. వీటి స్థానంలో రూ. 2 వేల నోట్లు తీసుకురాగా..ఆ తర్వాత వాటిని కూడా చలామణి నుంచి ఉపసంహరించుకుంది. అయితే త్వరలో రూ.వెయ్యి నోట్లను ఆర్బీఐ మళ్లీ ప్రవేశపెట్టనుందనే సోషల్ మీడియాలో తెగ వినిపిస్తున్నాయి. పసుపు రంగు, ఆలయం బొమ్మతో ఉన్న రూ.వెయ్యి నోట్లకు సంబంధించిన నకిలీ ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ వార్తలతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. దీంతో ఈ ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు దీనిపై క్లారిటీ ఇస్తూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేసింది.

'నకిలీ రూ. 1,000 నోటు హెచ్చరిక. కొత్త రూ. 1,000 నోటు జారీ చేయబడిందని పలు సోషల్ మీడియా పోస్టులు పేర్కొంటున్నాయి. కొత్త రూ. 1,000 నోటు జారీకి సంబంధించి ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆర్బీఐ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. సమాచారాన్ని అధికారిక మూలాల ద్వారా మాత్రమే ధృవీకరించుకోండి. ధృవీకరించని మార్గాల ద్వారా వచ్చే వార్తలను నమ్మకండి. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అనుమానాస్పద కంటెంట్ కనిపిస్తే.. @PIBFactCheck హ్యాండిల్‌కు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేయండి. 8799711259 నెంబర్ లేదా factcheck@pib.gov.in ద్వారా కూడా ఫిర్యాదు చేయండి' అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పష్టం చేసింది. అయితే సోషల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు ఆర్బీఐ కొత్తగా రూ.వెయ్యి నోటు తీసుకొచ్చిందంటూ ఏఐ జనరేటెడ్ ఫొటోలు, వీడియోలు సృష్టించి వైరల్ చేస్తున్నారు. త్వరలోనే ఇవి బ్యాంకుల, ఏటీఎంలలో అందుబాటులోకి రానున్నాయంటూ చెబుతున్నారు. ఈ వీడియోలు కేవలం ఊహాజనిత ఎడిటెడ్ గ్రాఫిక్స్ మాత్రమేనని, వాటికి నమ్మవద్దని కేంద్ర ప్రభుత్వం సూచించింది.
రూ.వెయ్యి నోట్లను తీసుకొస్తున్నట్లు ఆర్బీఐ ఎలాంటి సర్క్యూలర్ జారీ చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పష్టం చేసింది. ప్రజలు ఈ వార్తలను నమ్మి ఆందోళనకు గురి కావొద్దని స్పష్టం చేసింది. కేంద్రం, ఆర్బీఐ ఏదైనా నిర్ణయం తీసుకుంటే అధికారికంగా ప్రకటన లేదా సర్క్యూలర్ రూపంలో ప్రకటిస్తుందని, అప్పుడు మాత్రమే ప్రజలు విశ్వసించాలని సూచించింది. ఇక సోషల్ మీడియాలో వచ్చే మిగతా వార్తలను పట్టించుకవద్దని సూచించింది.

యూజర్లకు బిగ్ అలర్ట్..

జనవరి 1 నుంచి కొత్త రూల్

ఫోన్‌లో సిమ్ లేకపోతే యాప్ పనిచేయదా?

వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్స్ ఉపయోగిస్తున్నారా? అయితే మీకు ఒక ముఖ్యమైన విషయం తెలియాలి. సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు భారత ప్రభుత్వం కొత్త సిమ్ బైండింగ్ నిబంధనలను అమలు చేసేందుకు సిద్ధమైంది.

ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో వాట్సాప్ సహా పలు మెసేజింగ్ యాప్స్ వినియోగించే విధానంలో మార్పులు వచ్చే అవకాశం ఉంది.

సిమ్ బైండింగ్ అంటే ఏమిటి?:
ప్రస్తుతం చాలామంది తమ మొబైల్ నంబర్‌తో వాట్సాప్ అకౌంట్‌ను యాక్టివేట్ చేసుకున్న తర్వాత, ఆ సిమ్ కార్డును ఫోన్ నుంచి తీసేస్తున్నారు. అయినప్పటికీ వైఫై లేదా ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా వాట్సాప్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే కొత్త సిమ్ బైండింగ్ నిబంధనల ప్రకారం, మెసేజింగ్ యాప్ అకౌంట్‌కు అనుసంధానమైన సిమ్ కార్డు సంబంధిత ఫోన్‌లోనే ఉండి, యాక్టివ్‌గా ఉండేలా యాప్‌లు నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమల్లోకి వచ్చిన తర్వాత రిజిస్టర్డ్ సిమ్‌ను తొలగించడం లేదా అది పనిచేయకుండా పోవడం వల్ల యాప్ సేవలకు అంతరాయం కలగవచ్చు.

ఎందుకు ఈ కొత్త నిబంధన?:
దేశంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొంతమంది సైబర్ నేరగాళ్లు భారత మొబైల్ నంబర్లతో మెసేజింగ్ యాప్స్‌లో అకౌంట్లు సృష్టిస్తున్నారు. ఆ తర్వాత సిమ్ కార్డులను తొలగించినా, ఇంటర్నెట్ ద్వారా ఆ అకౌంట్లను ఉపయోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి అకౌంట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు టెలికమ్యూనికేషన్స్ శాఖ (ఇశీ) సిమ్ బైండింగ్ నిబంధనలను తీసుకొచ్చింది. ఈ విధానం ద్వారా నకిలీ గుర్తింపులతో జరిగే మోసాలు, ఫిషింగ్ దాడులు, డిజిటల్ అరెస్ట్ పేరుతో చేసే మోసాలను నియంత్రించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ నిబంధన ఒక్కటే అన్ని రకాల సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టలేదు.



ఏయే యాప్స్‌పై ప్రభావం ఉంటుంది?

ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే మెసేజింగ్ యాప్స్‌లో ప్రధానంగా ఈ యాప్స్ ఉన్నాయి:
వాట్సాప్ ,టెలిగ్రామ్ ,సిగ్నల్ ,స్నాప్‌చాట్ జియోచాట్ ,అరట్టై ,షేర్‌చాట్ ,జోష్
ఫోన్‌లో రెండు సిమ్‌లు ఉన్నవారికి ఇబ్బందులు వస్తాయా?
సాధారణంగా రెండు సిమ్ కార్డులు ఉపయోగించే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయితే మీరు వాట్సాప్ అకౌంట్‌ను ఏ మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేశారో, ఆ నంబర్‌కు సంబంధించిన సిమ్ కార్డు మీ ఫోన్‌లో యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు, మీరు ఒక నంబర్‌తో వాట్సాప్ అకౌంట్‌ను సృష్టించి, ఆ సిమ్‌ను వేరే ఫోన్‌లో ఉంచి, మీ ప్రధాన ఫోన్‌లో వైఫై ద్వారా వాట్సాప్‌ను ఉపయోగిస్తుంటే కొత్త నిబంధనల వల్ల ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల మీ వాట్సాప్ అకౌంట్‌కు అనుసంధానమైన సిమ్ కార్డు ఏ ఫోన్‌లో ఉందో ఒకసారి పరిశీలించుకోవడం మంచిది.

మెసేజింగ్ యాప్స్‌ను సురక్షితంగా ఉంచడం, సైబర్ మోసాలను తగ్గించడం ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశం. అయితే 2027 జనవరి 1 నుంచి ప్రతి వినియోగదారుడి వాట్సాప్ అకౌంట్ తప్పనిసరిగా నిలిచిపోతుందని అర్థం కాదు. రిజిస్టర్డ్ సిమ్‌ను ఫోన్‌లో యాక్టివ్‌గా ఉంచడం ద్వారా వినియోగదారులు కొత్త నిబంధనలకు

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 28-10-2026

నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ బి.చంద్రశేఖర్



నల్గొండ ప్రతినిధి, (సింగిడి): రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్పంచులు, గ్రామ కార్యదర్శులతో కోరారు. శుక్రవారం దేవరకొండా లోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో "ఎల్‌నినో ప్రభావం– తీసుకోవలసిన చర్యలపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్ నినో వల్ల వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకో వడం అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో చెరువులు, మిషన్ భగీరథ, బోర్లు, కాలువలు, వర్షపు నీటి ద్వారా లభించే నీటి నిల్వలపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వల వివరాలను గ్రామ కార్యదర్శులు తెలుసుకుని, వాటిని రానున్న నెలల్లో అవసరాలకు సరిపడా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించి సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. రానున్న రోజుల్లో తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన సజ్జలు, జొన్నలు, మినుములు, కందులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సుమారు 30 మంది రైతులు ఒక సమూహంగా ఏర్పడి సమిష్టి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో కూలీలకు పని కల్పించాలని, పశుసంపదను సంరక్షిస్తూ పశువులకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామాలలో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకొరత ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ఎంపీడీవోలు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చేపట్టిన పనులకు కొలతల పుస్తకాల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచులతో కలిసి క్రింద కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం నివారణ, నీటి పొదుపుపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తి యాన్ మావి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ (ప్రేమ్ కరణ్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ , పశు సంవర్ధక శాఖ అధికారి జివి రమేష్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఇంచార్జ్ఎంపీడీవో పార్వతి, అధికారులు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

అంతర్గాం పోలీస్ స్టేషన్‌పై సీపీ ఆకస్మిక తనిఖీ!

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి.. నిమజ్జన వేళ అప్రమత్తంగా ఉండాలని ఆదేశం





గోదావరిఖని,(సింగిడి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీ ఎస్., ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, సాంకేతిక వ్యవస్థల పనితీరును సమీక్షిస్తూ పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్న కమిషనర్.. ఎస్ఐ ఉదయ్ కిరణ్‌తో కలిసి కేసుల నమోదు, దర్యాప్తు తీరును సమీక్షించారు. ఆన్‌లైన్‌లో కేసుల నమోదు, ఈ-సాక్ష్య, ఈ-సమన్ల అమలు తీరును పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న (ఖ×) కేసులతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పురోగతిని సమీక్షించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కమిషనర్ పరిశీలించారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌లో విధుల నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. నిమజ్జన మార్గాలు, జనసమ్మర్థం ఉండే ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, బందోబస్తును పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, కేసుల దర్యాప్తు నుంచి పండుగల బందోబస్తు వరకు ప్రతి అంశంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు.

భూ రీసర్వే పనులను నిర్దేశిత గడువులోపు పకడ్బందీగా నిర్వహించాలి

పట్టా భూముల సర్వేకు ముందు రైతులకు సమాచారం ఇవ్వాలి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం





వనపర్తి ప్రతినిధి, (సింగిడి): భూ రీసర్వే పనులను నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా నిర్వహించా లని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి మండలం జక్కంపల్లి రెవెన్యూ శివారులో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్ సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రీసర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పట్టా భూముల సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందిం చాలని సూచించారు. భూముల సరిహద్దులను క్షేత్రస్థాయి లో కచ్చితంగా గుర్తించి ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా హద్దులను నిర్ధారించాలని తెలిపారు. ప్రతి రైతు భూమి సర్వే పూర్తయిన అనంతరం సర్వే వివరాలను రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, సర్వే పూర్తయినట్లు సంబంధిత రైతుల సంతకాలను తప్పనిసరిగా తీసుకో వాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులు తదితర వివరాల్లో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వభూములను ఎవరైనా తమ ఆధీనంలో ఉంచుకున్నట్లయితే అటువంటి భూములను గుర్తించి నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. భూ రీసర్వే పనుల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే ఏడి శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

భద్రతా రంగంలో ఎన్టీపీసీ తెలంగాణకు అరుదైన గౌరవం!

వినూత్న భద్రతా విధానాలకు అంతర్జాతీయ గుర్తింపు.. 'సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు-2026' కైవసం



గోదావరిఖని, (సింగిడి): విద్యుత్ ఉత్పత్తి రంగంలో భద్రతకు పెద్దపీట వేస్తూ, వినూత్న విధానాలతో సురక్షిత పని వాతావరణాన్ని బలోపేతం చేస్తున్న ఎన్టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. భద్రతా ప్రమాణాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపుగా సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు-2026'ను సంస్థ సొంతం చేసుకుంది. ఈ అవార్డుతో భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే సంస్థగా ఎన్టీపీసీ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. న్యూఢిల్లీలోని లోధి రోడ్డులో ఉన్న ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో అక్టోబర్ 23న నిర్వహించిన 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సు-2026లో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఐఈఐ-ఎన్‌యూఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ తెలంగాణ తరఫున ఏజీఎం (ఈఎండీ) రజనీష్ చంద్ర సన్యాల్, సీనియర్ మేనేజర్ (భద్రత) ఏ.వి.ఎన్. రెడ్డి అవార్డును స్వీకరించారు. విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాల్లో ప్రమాదాల నివారణ, వినూత్న భద్రతా పద్ధతుల అమలు, ఉద్యోగులు మరియు సిబ్బందికి సురక్షితమైన పని వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో ఎన్టీపీసీ తెలంగాణ చేపడుతున్న చర్యలకు ఈ పురస్కారం నిదర్శనంగా నిలిచింది. విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను పాటించేలా సిబ్బందిలో అవగాహన పెంపొందించడం, భద్రతా సంస్కృతిని నిరంతరం ప్రోత్సహించడం వంటి ప్రయత్నాలకు ఈ గుర్తింపు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సంస్థలో భద్రతను కేవలం నిబంధనగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. పారిశ్రామిక కార్యకలాపాల్లో భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, నిరంతర మెరుగుదల దిశగా ఎన్టీపీసీ తెలంగాణ చేస్తున్న కృషికి అంతర్జాతీయ వేదికపై ప్రశంసలు దక్కడం సంస్థకు గర్వకారణంగా మారింది. భద్రతే ప్రథమం- ఎల్లప్పుడూ, ప్రతిచోటా"లిలి అనే సూత్రాన్ని మార్గదర్శకం గా తీసుకుని, భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ఎన్టీపీసీ తెలంగాణ ముందుకు సాగుతోంది. సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు-2026 సాధనతో సంస్థ భద్రతా విధానాలకు మరింత ప్రోత్సాహం లభించడంతోపాటు, సురక్షితమైన విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాల పట్ల దాని నిబద్ధత మరోసారి స్పష్టమైంది.

రెడ్ క్రాస్ సేవలను జిల్లావ్యాప్తంగా విస్తరించాలి

నూతన కార్యవర్గానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచన



పెద్దపల్లి, (సింగిడి): మానవ సేవే లక్ష్యంగా పనిచేస్తూ, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గానికి సూ చించారు. శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చిం చారు. రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్య వసర సమయాల్లో రక్తాన్ని అందుబాటులో ఉంచడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని, సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన వారికి సహాయం అందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నూతన చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారి పాంపాటి శ్రీకాంత్, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు డీవీఎస్ మూర్తి, గూళ్ళ అంజన్ కుమార్, వేల్పుల రమేష్, వేల్పూరి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ మతాన్ని స్వీకరించిన తొలి విదేశీ మహిళ సిస్టర్ నివేదిత

అక్టోబర్ 28... సిస్టర్ నివేదిత జయంతి



వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత చరిత్రను సృష్టించింది. మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యా వంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ఐర్లాండ్‌లోని కౌంటీ టైరాన్‌లో 1867 అక్టోబర్ 28న ఆమె జన్మించింది. తండ్రి శామ్యూల్ రిచ్‌మండ్ నోబుల్, తల్లి ఇసాబెల్. స్కాట్లాండ్‌కు చెందిన వాళ్లు ఐర్లాండ్‌లో స్థిరపడ్డారు. మత బోధకుడైన శామ్యూల్ కూతురికి తరచు మానవసేవ గురించి చెప్పేవారు. అయితే, ఆమెకు పదేళ్ల వయసులోనే శామ్యూల్ మరణించాడు. తల్లి ఇసాబెల్ పుట్టింటికి చేరడంతో, మార్గరెట్ అక్కడే పెరిగింది.

లండన్‌లోని చర్చి బోర్డింగ్ స్కూల్‌లో, హాలిఫాక్స్ కాలేజీలో ఆమె చదువు సాగింది. ఒకవైపు చదువు కొనసాగిస్తుండ గానే, పదిహేడేళ్ల వయసులోనే చిన్నపిల్లలకు టీచర్‌గా పాఠాలు బోధించేది. తర్వాతి కాలంలో వింబుల్డన్‌లో స్వయంగా ఒక పాఠశాలను నెలకొల్పింది. కాలేజీ చదువు పూర్తయ్యాక వేల్స్‌కు చెందిన ఒక యువకుడితో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆకస్మికంగా మరణించాడు. మార్గరెట్‌కు ఆ షాక్ నుండి త్వరగా తేరుకో లేకపోయింది. మనశ్శాంతి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేది. ఆమె అలాంటి పరిస్థితుల్లో ఉన్న కాలంలోనే స్వామీ వివేకానంద అమెరికా నుంచి 1895లో లండన్ చేరుకున్నది. లండన్‌లోని ఒక సంపన్నుని ఇంట ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద వేదాంత ప్రసంగం కార్యక్రమానికి ఒక స్నేహితురాలి ద్వారా మార్గరెట్‌కు ఆహ్వానం అందింది. మార్గరెట్ ఆ కార్యక్రమానికి హాజరైంది. అక్కడక్కడ సంస్కృత శ్లోకాలను ఉటంకిస్తూ సాగిన వివేకానందుని వాక్ప్రవాహానికి ఆమె మంత్ర ముగ్ధురాలైంది. ఇక అప్పటి నుంచి లండన్‌లో వివేకానందుని కార్యక్రమాలన్నింటికీ క్రమం తప్పకుండా హాజరయ్యేది. సేవా దృక్పథమే ఆమెను లండన్ నుంచి కలకత్తాకు రప్పించింది. జీవితం అగమ్యంగా మారిన స్థితిలో తారసపడ్డ గురువు స్వామి వివేకా నంద బోధలకు బోధలే శాంతి మార్గమని నమ్మింది. అన్నీ వదులుకుని ఆయనతో కలసి భారత్‌కు వచ్చేసిందామె. అచిర కాలంలోనే సోదరి నివేదితగా భారతీ యులకు చిరపరిచితు రాలైంది.

వివేకానందుడి పిలుపుతో ఆమె సముద్రమార్గంలో 1898 జనవరి 28న కలకత్తా చేరుకుంది. వివేకా నందుడి గురువైన రామకృష్ణ పరమహంస సాధనలతో గడిపిన దక్షిణేశ్వర ఆలయాన్ని సందర్శించు కుంది. కలకత్తాలో 1898 మార్చి 11న ఏర్పాటైన బహిరంగ కార్యక్రమంలో స్వామి వివేకానంద తొలిసారిగా మార్గరెట్‌ను ప్రజా నీకానికి పరిచయం చేశారు. కొద్ది రోజులకే ఆమె రామకృష్ణ పరమహంస సతీమణి శారదా దేవిని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. జీవితాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబిస్తానని ప్రతిన బూనడంతో స్వామి వివేకానంద ఆమె పేరును 'సోదరి నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. నివేదితగా మారిన తర్వాత వివేకానందునితో కలసి ఆమె విస్తృతంగా భారత దేశమంతటా పర్యటించింది. నిధుల సేకరణ కోసం, ఆధ్యాత్మిక ప్రచారం కోసం అమెరికా కూడా వెళ్లింది. అల్మోరాలో ఉన్న సమయంలో ధ్యానం చేయడంలో శిక్షణ పొందింది. మనసు తన గరిమనాభిని మార్చుకునే ప్రక్రియగా ధ్యాన ప్రక్రియను ఆమె అభివర్ణించింది. భారతదేశం గొప్ప మహిమాన్విత దేశమని పొగడుతూ పాశ్చాత్య దేశాల్లోని తన మిత్రులకు ఉత్తరాలు రాసేది.

వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ది మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించింది. ఇతరులపై దయా గుణంతో మెలిగే ఆమె, మంచి అభిరుచిగల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా బాలికల విద్యకోసం ఆమె 1898 నవంబరులో కలకత్తా లోని బాగ్‌బజారులో పాఠశాలను ప్రారంభించింది. కనీస విద్యలేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేసింది. ప్రాథమిక విద్య అందించడానికి విశేష కృషి చేసింది. అన్నికులాల మహిళలకు చదువు తప్పనిసరిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. బెంగాల్ మహిళలతో, మేధావులతో పరిచయాలను ఏర్పాటు చేసుకుని బాలికల విద్యకోసం ఎంతో శ్రమించింది. విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, జగదీశ్ చంద్ర బోస్ తదితర ప్రముఖులతో స్నేహసంబంధాలను కొనసాగించింది. 1899 సంవత్సరం మార్చిలో కలకత్తావాసులకు ప్లేగ్ వ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించింది. భారత మహిళల ఔన్నత్యం గురించి, ఆచార వ్యవహారాల గురించి న్యూయార్క్ , షికాగో మొదలైన నగరాల్లో ఆమె ప్రసంగించింది.

వివేకానందుని బోధలను యువతరానికి చేరవేసేందుకు అహరహం కృషి చేసింది. కలకత్తాలో ప్లేగు మహమ్మారి వ్యాపించినప్పుడు రోగుల దగ్గరే ఉండి, వారికి సేవలందించింది. భారత జాతీయ, స్వాతంత్ర్యో ద్యమాలకు ఇతోధికంగా తోడ్పాటు నందించింది. విద్యా వ్యాప్తికి, సేవా కార్యక్రమాల అమలుకు విశేషంగా కృషి చేసింది. స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధ్యాత్మికవేత్త అరబిందో ఆధ్వర్యంలో వెలువడే 'కర్మయోగి' పత్రికకు సంపాదకు రాలిగా సేవలందించింది. మేధా సంపత్తిలో భారతదేశం అద్వితీయమైనదని ప్రపంచానికి చాటింది. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించింది. భారతీయతను పూర్తిగా ఆకలింపు చేసుకున్న ఆమె మహిళావిద్య కోసం ఎంతగానో పాటు పడింది.

1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. విదేశీయురాలు అయినప్పటికీ భారతీ యతను పుణికిపుచ్చుకుని స్వామి వివేకానందతో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించిన ఆమె డార్జిలింగ్‌లో ఉండగా, అనారోగ్యానికి గురైన నివేదిత 1911 అక్టోబర్ 13న తన 43వ ఏట తుదిశ్వాస విడిచింది.

భారత దేశంతో, భారత ప్రజలతో మమేకమై జీవించిన ఆమె స్మార్తి నేటికీ కొనసాగుతూనే ఉంది. పలు చోట్ల ఆమె స్మారకచిహ్నాలు, ఆమె పేరిట ఏర్పాటైన పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు నేటికీ ఆమె సేవానిరతికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

రాము కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 28-10-2026

దేవాలయాలు, దేవాదాయ భూముల సమస్యల పరిష్కారానికి ఎండోమెంట్ కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి

హైదరాబాద్, (సింగిడి): మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని దేవాలయాలు, దేవాదాయ భూములు, వివిధ సామాజిక వర్గాలకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఐఏఎస్ ని తన కార్యాలయం లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు...

1. జయగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని,గౌతమ్ నగర్ డివిజన్‌లోని జయగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ స్థలంలో ఇస్కాన్ (హరే రామ హరే కృష్ణ) సంస్థ ఆధ్వర్యంలో కళ్యాణ మండపం ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతులు, సహకారం అందించాలని, భక్తులకు, స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా ఈ ప్రతిపాదనను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.
2. మున్నూరు కాపు భవన నిర్మాణానికి అడ్డంకులు తొలగింపు,



మల్కాజిగిరిలోని శ్రీ విష్ణు దేవాలయం సమీపంలో మున్నూరు కాపు భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ఉన్న అడ్డంకులను తొలగించి, భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుకూల పరిస్థితులు కల్పించాలని కోరారు. సామాజిక వర్గ అభివృద్ధికి, సమాజ కార్యక్రమాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.

3. శివపురి కాలనీలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంపై, మల్కాజిగిరి శివపురి కాలనీలో ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలో చేర్చకుండా ఉండేలా సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
4. అల్వాల్‌లో చిలకమఠం రామాలయం దేవాదాయ భూముల పరిరక్షణ, అల్వాల్ ప్రాంతంలోని చిలకమఠ రామాలయానికి సంబంధించిన దేవాదాయ భూములు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దేవాదాయ భూములను కబ్జాల నుంచి కాపాడేందుకు తక్షణమే తగిన చర్యలు చేపట్టి, వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ అంశాలపై ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ హనుమంతరావు ఐఏఎస్ గారు సానుకూలంగా స్పందించారు. సంబంధిత సమస్యల పరిష్కారా నికి అవసరమైన అంశాలను పరిశీలిస్తామని సానుకూలత వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, దేవాలయాల అభివృద్ధికి, దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

హిందువుల పవిత్ర పర్వదినాలు అట్లతద్ది, కర్వా చౌత్

పండుగలు మన హిందూ సంప్రదాయాల్లో అతి ప్రధానమైనవి. కాయకష్టం చేసుకుంటూ జీవితాలను గడిపే నిరుపేదల కళ్లల్లో ఆనందాల కాంతులు వెదజల్లే బాధ్యతలను పండుగలు తీసుకోవడం హర్షణీయం. పండుగలు ప్రతి ఏటా దక్షిణాదికి చెందిన రాష్ట్రాలు, ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో "అట్లతద్ది" పర్వదినాన్ని, ప్రపంచవ్యాప్తంగా హిందూ బంధువులు "కర్వా చౌత్" పండుగను ఘనంగా జరుపుకుంటున్నాం.

దక్షిణాదిన అట్లతద్ది పండుగ:

అట్లతద్ది ఆరట్లు..ముద్ద పప్పు మూడట్లు... అంటూ సినీగేయం పాటతో చేసుకోవడం మనందరికీ తెలుసు. దక్షిణాది రాష్ట్రాల్లో , ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలో "అట్లతద్ది" పండుగను ఆశ్వయుజ బహుళ తదియ నాడు (28 అక్టోబర్) ఉయ్యాల పండుగ అని, గోరింటాకు పండుగ అని కూడా అంటారు. ఈ రోజున కుజదోష నివారణకు పూజలు జరుపుకోవడం ఆనవాయితీ వస్తోంది. అట్లతద్ది రోజున తమ ఇంట్లో అట్లు వేసి ఒకరికొకరు వాయనంగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఆడ పిల్లలు చెట్లకు ఊయలలు కట్టి సంతోషంగా ఊగుతూ అపూర్వ అనుభూతులను పొందుతారు. వివాహిత మహిళలు తమ భర్తల ఆయురారోగ్యాల కోసం, పెళ్లి కాని అమ్మాయిలు మంచి మొగుడు దొరకాలని అట్లతద్ది నోములు ఆచరిస్తారు.

అట్లతద్ది నోముల పురాణ కథ:

పూర్వం ఓ రాజు కూతురు, ఓ మంత్రి కూతురు, ఓ సేనాని కూతురు, ఓ పురోహితుడి కూతురు నలుగురూ స్నేహంగా కలిసి మెలిసి ఉండేవారు. ఓ రోజు అట్లతద్ది పండుగ వస్తుంది. ఆ రోజు రాత్రి చంద్రుడికి పూజ చేయడానికి వాళ్లు సిద్ధమవుతారు. పెద్దలు దేవీ పూజకు నైవేద్యం సమర్పించడానికి అట్లు వేయడంలో నిమగ్నమై ఉంటారు. ఇంతలో రాజు కూతురు ఆకలితో సొమ్మసిల్లి పడిపోతుంది. వెంటనే రాజకుమారి అన్న తన చెల్లెలికి అద్దంలో తెల్లని వస్తువు చూపి చంద్రోదయం అయ్యింది తెల్లే అని, కొన్ని పండ్లు తిని సేదదీరి పూజ కొనసాగించమని అంటాడు. అప్పుడు రాకుమారి ఉపవాసం విరమించి ఆహారం తీసుకొని పూజను చేసుకుంటుంది. ఇలా చంద్రోదయం తర్వాత మాత్రమే ఉమాదేవికి పూజలు చేయడం, 9 అట్లు నైవేద్యంగా పెట్టి, వాటిని వాయనం ఇవ్వడం, 9 పువ్వులతో ముడి తోరం కట్టుకుంటారు. ఇలా చేయడం వల్ల మంచి భర్త వస్తాడని నమ్ముతారు. నలుగురు స్నేహితుల్లో రాకుమారికి ముసలి భర్తను ఎంపిక చేస్తారు. మింగిన ముగ్గురికి మంచి యవ్వనులైన భర్తలు వస్తారు. దీనికి దుఃఖించిన రాకుమారి పారిపోయి మర్రి చెట్టు నీడన ఏడ్వడంతో పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై నీ అన్న అజ్ఞానం, నీ మీద ప్రేమ కారణంగా వ్రత భంగం జరగడంతో నీకు ముసలి భర్తను ఎంపిక చేశారని, అట్లతద్ది పూజను సరిగ్గా చేయమని సూచిస్తారు. దానితో యువరాణి మళ్లీ పద్ధతి ప్రకారం అట్లతద్ది నోము చేయడంతో తనకు మంచి అందమైన భర్త లభిస్తాడు. అందువల్ల అట్లతద్ది రోజు చంద్రోదయం తర్వాత మాత్రమే పూజను ముగించి ఆహారం తీసుకోవాలనే ఆచారం ఏర్పడింది.

కర్వా చౌత్ పండుగ:

ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం జరుపుకునే ముఖ్య పర్వదినాల్లో "కర్వా చౌత్" లేదా "కరక చతుర్థి" కూడా ఒకటి కావడం గమనార్హం. శివపార్వతులను పూజించే పండుగగా దీనిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కార్తీకమాసంలో కృష్ణ పక్షం చతుర్థి తిథి రోజున కర్వా చౌత్ పండుగను ఉత్తర భారతం జరుపుకుంటారు. 2025లో కర్వా చౌత్ పండుగ 29 అక్టోబరు రోజున జరుపుకుంటున్నాం. హిందూ పురాణాల ఆధారంగా సావిత్రి తన భర్త ఆత్మ కోసం యముడిని ఈ ఉపవాస దీక్షతో వేడుకుంటుంది. శివుడిని భర్తగా పొందడం కోసం గౌరీదేవి తొలి వ్రతంగా కర్వా చౌత్ పూజలు చేసినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి . వివాహిత స్త్రీలు భర్తల దీర్ఘాయుస్సు కోర్ ఉపవాసం ఉంటూ కర్వా మాత(పార్వతీ దేవి)ను పూజిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు తమకు మంచి భర్త రావాలని ఉపవాస పూజలు చేస్తారు. ఈ రోజు మహిళలు సాయంత్రం చంద్రుని దర్శనం తర్వాత భర్త ముఖాన్ని జల్లెడలో చూసి, అతని చేతుల మీదుగా స్త్రీలు ఉపవాసాన్ని విరమిస్తారు. స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకునే అతి ముఖ్యమైన వ్రతంగా కర్వా చౌత్ లేదా అట్లతద్దిని జరుపుకుంటారు. మన ఆచారాలు, సాంప్రదాయాలు, పండుగలు పబ్బాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ దేవుడు/దేవతల దీవెనలు పొందుతూ ఆనందంగా జీవితాలను గడుపుదాం, ఐక్యత కలిగిన పౌర సమాజాన్ని నిర్మించుకుందాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భూములకు రీ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ కె. హరిత

కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): భవిష్యత్తులో భూ సమస్యలు, గెట్టు పంచాయితీలు తలెత్తకుండా ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించా లని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కెరమెరి మండలం నాగపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీ సర్వేకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. ప్రతి రైతు సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా టాంటాం ద్వారా ప్రచారం చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వంతో పనులు





చేపట్టాలని స్పష్టం చేశారు. రీ సర్వేనిర్వహణ కోసం ప్రతి మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వేలో ఖచ్చితమైన కొలతలు తీసుకునేందుకు రోవర్లను వినియోగిస్తున్న ట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్వే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే డిప్యూటీ ఇన్స్పెక్టర్ శ్రవణ్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి సదస్సు.. పాల్గొన్న డీపీఆర్వో శీలం శ్రీనివాస్, సాంస్కృతిక సారథి కళాకారులు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (సింగిడి): ఎల్‌నినో ప్రభావాలతో భవిష్యత్తులో తలెత్తే వాతావరణ మార్పులు, వర్షపాత లోటు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. సమాచార పౌరసంబంధాల శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి డీపీఆర్వో శీలం శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించడంలో జిల్లా పౌర సంబంధాల అధికారుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వివరించారు. సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కళాజాతాలు, పాటలు, నాటికలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, తాగునీటి వినియోగంలో జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.



ఎల్‌నినో ప్రభావాల వల్ల వ్యవసాయం, విద్యుత్, మిషన్ భగీరథ, పశుసంవర్ధక రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడాన్ని దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కళాకారుల ద్వారా గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ప్రజలను సన్నద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డా. జి. వెన్నెల, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు రవీందర్ రెడ్డి, వివిధ జిల్లాల జిల్లా పౌర సంబంధాల అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

45 రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే రైస్ మిల్లర్ల ఆస్తులు జప్తు !

డిఫాల్ట్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు హెచ్చరిక
పెండింగ్ బకాయిల వసూళ్లపై అధికారులతో సమీక్ష.. ఆస్తుల వివరాల సేకరణకు ఆదేశం

పెద్దపల్లి, (సింగిడి): ప్రభుత్వానికి చెల్లించా ల్సిన పెండింగ్ బకాయిలను 45 రోజుల్లోగా చెల్లించాలని డిఫాల్ట్ రైస్ మిల్లర్లను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన గడువు లోగా బకాయిలు చెల్లించని మిల్లర్ల ఆస్తులను జప్తు చేసేం దుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో పాటు డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో ఆయన



బకాయిల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా బకాయిల చెల్లింపు పురోగతి, వసూళ్ల ప్రక్రియ, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువును రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. తమకు సంబంధించిన పెండింగ్ బకాయిలన్నింటినీ నిర్దేశిత సమ యంలోగా చెల్లించి తదుపరి చర్యలకు అవకాశం లేకుండా చూసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్ల విషయంలో నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు చెందిన స్థిర, చర ఆస్తులను గుర్తించి వాటి పూర్తి వివరాలను సేకరించాలని సబ్ రిజిస్ట్రార్ అధికారులను ఆదేశించారు. ఆస్తుల వివరాలను సమగ్రంగా నమోదు చేసి, అవసరమైన తదుపరి చర్యలకు వీలుగా సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. గడువు ముగిసేలోగా బకాయిలు చెల్లించని మిల్లర్ల విషయంలో ఆస్తుల జప్తు ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్, సబ్ రిజిస్ట్రార్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రభాస్ అన్న పుట్టినరోజు.. అనాథ చిన్నారులకు అన్నదానం..

అభిమాన హీరో జన్మదిన వేడుకలను సేవా కార్యక్ర మంతో నిర్వహించిన చాతల శివ

సుల్తానాబాద్, (సింగిడి): పాన్ ఇండియా స్టార్, యం గ్ రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరిం చుకొని సుల్తానాబాద్ పట్టణంలో అభిమానులు సేవా కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహిం చారు. పట్టణం లోని మానసిక వికలాం గుల కేంద్రంలో చిన్నారు లు, వృద్ధులకు అన్నదానం చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి తమ అభిమాన నటుడు ప్రభాస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్ర భాస్ అభిమానులు చాతల శివ, పూసల రాకేష్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రభాస్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు..

ఈ సందర్భంగా చాతల శివ మాట్లాడుతూ.. ప్ర భాస్ కేవలం సినీ నటుడు మాత్రమే కాదని, తన సేవా కార్యక్రమాలతో ఎంతోమం దికి స్ఫూర్తిగా నిలుస్తున్న గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రతి సంవత్సరం జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకుం టున్నామని తెలిపారు. ప్రభాస్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని విజ యాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రభాస్ అంటే ఓ ఎమోషన్..



ముఖ్య అతిథి తుమ్మ రాజ్ కుమార్ మాట్లాడు తూ.. ప్రభాస్ తమకు కేవలం హీరో మాత్రమే కాదని, ఒక భావోద్వేగమని పేర్కొన్నా రు. బాహుబలి చిత్రంతో తెలుగు జాతి గర్వాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప నటుడని కొనియాడా రు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం, సినిమాల పట్ల చూపించే నిబద్ధత అభిమానులకు ఆదర్శమని అన్నారు. ప్రభాస్ రాబోయే చిత్రాలతో మరిన్ని విజయాలు అందుకోవాలని, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండలా ధ్యక్షుడు చాతల శివ, ఉపాధ్యక్షుడు గర్విందుల సతీష్, ప్రధాన కార్యదర్శి పూసల రాకేష్, కోశాధికారి కానిగంటి శ్రీకాంత్, ఎలిగేడు మండల అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, కేంద్ర ఇన్‌చార్జి శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యుడు దేశెట్టి రమేష్, సిబ్బంది సరస్వతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

వనపర్తి ప్రతినిధి, (సింగిడి): ఎస్ ఐ ఆర్ నోటీసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నోటీసుల పరిష్కార పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత అధికారులుక్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అక్టోబర్ 25వ తేదీలోగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి పెండింగ్ నోటీసుల పరిష్కారాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణలకు సంబంధించిన దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించకుండా నిర్దిష్ట సమయంలో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

రానున్న ఉమ్మడి మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను



వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 12,400 దరఖాస్తులు అందినట్లు పేర్కొంటూ వాటి పరిశీలనను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను నిబంధనల ప్రకారం ధ్రువీకరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామిరెడ్డి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

విహాన్ పుట్టినరోజు.. విద్యార్థులకు చదువుల కానుక

పుట్టినరోజు వేడుకలకు మానవీయ స్పర్శ

మంచిర్యాల, (సింగిడి): పుట్టినరోజు అంటే కేక్ కట్ చేయడం.. బంధుమిత్రులతో ఆనందంగా గడవడం.. కానీ ఆ వేడుకలతో మరికొందరి ముఖాల్లో చిరునవ్వు లు పూయిస్తే ఆ ఆనందం మరింత ప్రత్యేకం. తమ చిన్నారి పుట్టినరోజును పేద విద్యార్థుల మధ్య నిర్వహిస్తూ.. వారికి చదువుకు అవసరమైన సామగ్రిని అందించి ఓ కుటుంబం సేవాభావాన్ని చాటుకుంది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ ఆర్పీఓసీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకుడు, సమాజ సేవకుడు యుగంధర్ సాయి తన రెండో కుమారుడు విహాన్ పుట్టినరోజు వేడుకలను ఏసీసీ లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల మధ్య నిర్వహించారు. విహాన్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు విద్యా పలకలు, పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులను యుగంధర్ సాయి పంపిణీ చేశారు. సాధారణంగా పుట్టిన రోజు వేడుకలు కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య నిర్వహించుకుంటారు. అందుకు భిన్నంగా.. సమాజానికి



ఉపయోగపడేలా వేడుకలను నిర్వహించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చదువుకునే చిన్నారులకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారిలో విద్యపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, చదువు ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ముందడుగు వేశారు. విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు.. వారి ముఖాల్లో చిరునవ్వులు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్ననాటి నుంచే పుస్తకాలపై ఆసక్తి, విద్యపట్ల అభిరుచి, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

వేడుకల్లో సేవాభావం.. విద్యార్థుల్లో స్ఫూర్తి...

పుట్టినరోజు అనేది కేవలం వ్యక్తిగత ఆనందానికి పరిమితం కాకుండా.. ఇతరుల జీవితాల్లో సంతోషాన్ని పంచే అవకాశంగా మారాలని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం చిన్న సహాయమే అయినా.. వారి చదువుకు ప్రోత్సాహాన్ని అందించే మంచి ప్రయత్నంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. విహాన్ తల్లిదండ్రులు యుగంధర్ సాయి, రమ్యకృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాల ఎండీ ఎం. సురేశ్, ప్రధానోపాధ్యాయురాలు సంగీత సహ కారం అందించారు. చిన్నారి పుట్టినరోజు వేడుకలు విద్య పట్ల ప్రేమను, సామాజిక బాధ్యతను చాటుతూ ఆదర్శంగా నిలిచాయి.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మెకు నాయకుల సంఘీభావం

11వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె.. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్

వనపర్తి ప్రతినిధి, (సింగిడి): వనపర్తి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఈ సమ్మెకు సిపిఎం జిల్లా నాయకులు జబ్బార్, సిఐటియు వనపర్తి జిల్లా వైస్ ప్రెసిడెంట్ నిక్సన్, సామాజిక కార్యకర్త గంధం నాగరాజు లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం, వేతనాలు పెంచడం, 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయడం



వంటి డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వారి న్యాయమైన హక్కులను కల్పించాలని



డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. సమ్మెకు మద్దతు తెలిపిన నాయకులకు ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

మహా సిమెంట్ యాజమాన్యం బాధ్యత వహించాలి!

లారీ ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి..
బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువుల డిమాండ్
కోదాడ-మేళ్లచెరువు ప్రధాన రహదారిపై ధర్నా
విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ

కోదాడ, (సింగిడి): కోదాడ మండలం గణప వరం గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో మహా సిమెంట్ లారీ టాంకర్ ఢీకొన దంతోనే మేళ్లచెరువు మండలం నల్లబండ గూడెం



గ్రామానికి చెందిన కలకొండ శ్రీను మృతిచెందాడని ఆయన బంధువులు ఆరోపించారు. ప్రమాదం జరిగిన అనంతరం లారీని ఆప కుండా వెళ్లిపోయిం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు



సంబంధించి కంపెనీ

గోదావరి జలాలను ఒడిసిపట్టి.. వేసవికి నీటి భరోసా!

వేసవి తాగునీటికి ఇప్పటి నుంచే ప్రణాళిక..
దుమ్ముగూడెం ఆనకట్టపై మంత్రి తుమ్మల పరిశీలన





అశ్వాపురం, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించు కోవాలని, వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిరాష్ట్రవ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆనకట్టపై ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి, పడవల సంఖ్యను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఒక టీఎంసీ నీటి నిల్వే లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగం, ప్రజారోగ్యం, పశుసంపదపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను భయాందోళనకు గురిచేయడం తమ ఉద్దేశం కాదని, రానున్న పరిస్థితులను ముందుగానే అంచనా వేసి నష్టాలను నివారించేందుకు అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది వర్షపాతంలో లోటు, నదులు, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలు తగ్గడం, రిజర్వాయర్లలో పరిమిత నీటి నిల్వల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో బోర్ల నుంచి నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చడం ప్రధాన సవాలుగా మారే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గోదావరి నీటిని నిల్వ చేయడం ద్వారా వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ఆనకట్టపై సుమారు ఒక మీటరు ఎత్తున ఇసుక బస్తాల పొరలను ఏర్పాటు చేసి దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వేసవిలో గోదావరి ప్రవాహం తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటిని నిల్వ చేసుకోవడం అవసరమన్నారు.

రోజుకు 10 వేల నుంచి 15 వేల ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలి

ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేసేందుకు రోజుకు 10 వేల నుంచి 15 వేల బస్తాలను ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పనులకు సుమారు లక్షన్నర ఇసుక బస్తాలు అవసరమవుతాయని తెలిపారు. అవసరాన్ని బట్టి కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు అదనపు పడవలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాతావరణ శాఖ వర్షసూచనలను పరిగణనలోకి తీసుకుంటూ గోదావరి ప్రవాహంలో వచ్చే మార్పులకు అనుగుణంగా పనులు చేపట్టాలని, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి ప్రవాహం పెరిగినా పనులకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే నీటి నిల్వలను కాపాడుకోవడం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. భద్రాచలంతో పాటు ఇతర ప్రాంతాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీని సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేస్తూనే అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

నీటి లభ్యతకు అనుగుణంగా రబీ సాగు

వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీ సాగులో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను అంచనా వేసుకుని అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని కోరారు. తక్కువ నీటితో పండే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూమిలోని తేమ, నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, అధిక నీటి అవసరం ఉండే పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రస్తుత సీజన్‌లో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు నీటిని అందించడంతో పాటు వైరా, లంకసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తుమ్మలచెరువు, సింగభూపాలం, అన్నదైవం, మూక మామిడి వంటి చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాల పెంపు, పశువులకు నీటి లభ్యత, రైతుల సాగు అవసరాలకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించడంతో పాటు పండించిన పంటలను కొనుగోలు చేయడం, రైతు భరోసా వంటి సహాయక చర్యలను కొనసాగిస్తూ రైతాంగానికి అండగా నిలుస్తున్నామని మంత్రి తెలిపారు. రానున్న కాలంలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అఖిలపక్షంతో చర్చించి, అవసరమైన సహాయ సహకారాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు. పంట కాలువల మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గ్రామీణ ఉపాధిని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి వనరులను మెరుగుపరుచుకోవచ్చన్నారు. పశువులకు, అవసరమైన చోట వన్యప్రాణులకు కూడా నీటి లభ్యత కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, ప్రజారోగ్య పరిరక్షణపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు.రానున్న కాలంలో నీటి కొరత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణ, తాగునీటి పొదుపు, రైతులకు అవగాహన కల్పించే అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ, అమ్మగారిపల్లి సర్పంచ్ కవిత, పార్టీ నాయకులు,కార్యకర్తలు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు 'అలయ్ బలయ్' వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



ఎల్బీనగర్, (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి బండ్రు శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్ బలయ్' వేడుకల్లో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షు రాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రముఖ గాయని, ఉద్యమకారిణి విమ లక్క, ఆర్టీఐ సభ్యులు అయోధ్య రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, గాయకుడు నల్గొండ గద్దర్ నర్సి రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు..

33 జిల్లాల్లో సంఘ భవనాలు!
కార్మికుల హక్కులు, కనీస వేతనాల పెంపునకు కృషి: మంత్రి వివేక్ వెంకటస్వామి
పెద్దపల్లిలో ఘనంగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది వేడుకలు



పెద్దపల్లి, (సింగిడి): హమాలీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో స్థలాలు కేటాయించి సంఘ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పట్టణంలోని ఎం.బి. గార్డెన్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ హమాలీ కార్మికుల సంక్షేమానికి తమ కుటుంబం మొదటి నుంచి అండగా నిలుస్తోందని తెలిపారు. కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్మికుల కనీస వేతనాలను పెంచాల్సిన అవసరం ఉందని, ఈ అంశంపై ఎమ్మెల్సీ కోదండరామ్ చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కాకా వెంకటస్వామి కుటుంబానికి పెద్దపల్లి ప్రజలు చూపిస్తున్న ఆదరణను ఎప్పటికీ మరచిపోలేమని మంత్రి తెలిపారు. కార్మికుల ఆదరణ వల్లే తాము ఈ స్థాయికి చేరుకున్నామని, వారి అభ్యున్నతికి నిరంతరం పనిచేస్తామని చెప్పారు. ఎఫ్‌సీఐ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్‌లో గళమెత్తాలని కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని హమాలీ కార్మికులు తన దృష్టికి తీసుకువస్తే, వారికి ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో హమాలీ కార్మిక సంఘ భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెడి వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ శివకుమార్, ప్లాట్‌ఫామ్ అండ్ గిగ్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే సలావుద్దీన్, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి, డిప్యూటీ మేయర్ పి ఎల్లయ్య,లీగల్ అడ్వైజర్ ఉప్పు రాజన్న, జంగ సంపత్ యాదవ్, కొమ్ము మధు, కామ భూమన్న, జీఎంఆర్ గోడౌన్ నాయకులు చిప్ప రాజు, తిరుపతి, సందీప్, ఎస్‌డబ్ల్యూసీ గోదాం ప్రతినిధులు బండారి రమేష్, నాగన్నతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ గోదాములు, వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఐకేపీ బజార్లు, రైల్వే గూడ్స్ షెడ్లు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటును నమోదు చేసుకోవాలి

మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, (సింగిడి): వినాయక నగర్ డివిజన్ వినాయక నగర్ డివిజన్ చంద్రగిరి కాలనీలోని నలంద స్కూల్ రోడ్ లో ఆదివారం బిజెపి పార్టీ నాయకులు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినాయక్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు గడిచిన ప్రతి ఒక్కరు పట్టబద్రుల ఓటర్ నమోదు కు అర్హులని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓం ప్రకాష్, గోపాల్ యాదవ్, సంతోష్, శంకర్ యాదవ్, నరేంద్ర, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

సిఐడి అదుపులో.. జమ్మికుంట, హుజూరాబాద్ మిల్లర్లు

ఎఫ్ సి ఐ బియ్యం సరఫరా లో గోల్మాల్
నలుగురు మిల్లర్లను సిఐడి కార్యాలయానికి తరలింపు



జమ్మికుంట,(సింగిడి): సీఎంఆర్ సరఫరాలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని పక్కా సమాచారంతో రాష్ట్ర నేర పరిశోధన విభాగం సిఐడి అధికారులు జమ్మికుంట హుజురాబాద్ పట్టణంలో మెరుపు దాడులు నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని ఆబాది జమ్మికుంట శివారులో గల లక్ష్మీస్థాయి ఇండస్ట్రీ యజమాని యాంసాని సంపత్, లక్ష్మీ వెంకటరమణ యజమానిఒ ల్లాల మల్లికార్జున్, రాధాకృష్ణ మిల్లుయజమాని లెంకలపల్లి మధు హుజురాబాద్ పట్టణానికి చెందిన కల్లూరి కృష్ణమూర్తి లను సిఐడి పోలీసులు వారి ఇంటి వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఒక్కసారిగా సిఐడి అధికారులు అదుపులోకి తీసుకోవడంతో కుటుంబ సభ్యులతో పాటు జమ్మికుంట పట్టణంలోని ప్రజలు ఉలిక్కిపడ్డారు.

ఎఫ్ సి ఐ బియ్యం సరఫరాల లో గోల్ మాల్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ కింద పౌరసరఫరాల శాఖకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అప్పగించాల్సి ఉండగా సదరు మిల్లుల యజమానులు దొడ్డు బియ్యాన్ని అప్పగించి అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని అభియోగాలు ఆరోపణలు ఉన్నాయి. పేద ప్రజలకు పంపిణీ చేయవలసిన నాణ్యమైన బియ్యం విషయంలో చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టేలా వ్యవహరించడంపై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పౌరసరఫరాల శాఖ కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు డిఫాల్ట్ మిల్లర్లు, సీఎంఆర్ బియ్యం లో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలనే ఉద్దేశంతో ఈ బాధ్యతలను సిఐడి కి అప్పగించగా వారు రంగంలోకి దిగి ఆరోపణలు ఉన్నవారిని అదుపులోకి తీసుకున్నారు.

15 రోజుల క్రితం ఐదు మిల్లులలో అధికారుల సోదాలు..

జమ్మికుంట పట్టణంలోని ఐదు మిల్లులలో టాస్క్‌ఫోర్స్ ఏసిపి రమేష్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలను నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని మహేశ్వర ట్రేడింగ్ లో 1350 క్వింటాళ్ల వ్యత్యాసం ఉందని, అదేవిధంగా అన్నపూర్ణ ట్రేడింగ్లో 650 కింటాళ్ల వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. లక్ష్మీ సాయి ,కారుణ్య రాజరాజేశ్వర మిల్లులలో అధికారులు సోదాలు నిర్వహించారు. ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామం లోని ప్రేమ్ సాయి రైస్ మిల్లులో పౌర సరఫరా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మిల్లుకు 22 వేల 141 క్వింటాళ్ల సీఎంఆర్ఎఫ్ ధాన్యాన్ని కేటాయించారు. ఇందులో ప్రభుత్వానికి 14835 ఇవ్వవలసి ఉండగా కేవలం 17 21 కింటాలు మాత్రమే ఇచ్చారు. 6,31,71,106 రూపాయల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. పౌరసరఫరాల మేనేజర్ రజనీకాంత్ ఫిర్యాదు మేరకు మిల్లు యజమానులు చంద్రశేఖర్, సాయి కృష్ణ ల పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని ఎఫ్సీఐలో అధికారులు సోదాలు చేసిన మిల్లుల నుండి వచ్చిన ధాన్యం శాంపిల్స్ను సేకరించారు. ఎఫ్సీఐలో అధికారులు సేకరించిన బియ్యం లో అక్రమాలు ఉండడంతో ఆ అవినీతికి పాల్పడిన నలుగురు మిల్లర్లను ఆదివారం తెల్లవారుజామున సిఐడి అధికారులు అదుపులోకి తీసుకుని కరీంనగర్ కార్యాలయానికి తరలించారు. మిల్లర్లను సిఐడి అధికారులు అదుపులోకి తీసుకున్నారని వార్త జిల్లాలో సంచలనం సృష్టించడంతోపాటు మిల్లర్ల లో తీవ్ర ఆందోళన ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిఫాల్ట్ మిల్లర్లతో పాటు సీఎంఆర్ బియ్యం విషయంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దృఢ నిశ్చయంతో ఉండడంతోపాటు అధికారుల పర్యవేక్షణ పై కూడా ప్రత్యేకంగా పెట్టింది.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు తరలిన వ్యాపారులు

ఆదివారం సిఐడి పోలీసులు అక్రమలకు పాల్పడ్డ వ్యాపారస్తులను కస్టడీలోకి తీసుకోవడంతో చాలామంది రైస్ మిల్లర్లు జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనానికి పరుగులు తీశారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో అని వ్యాపారస్తులు ఆందోళన చెందుతూ దీనికి పరిష్కారం మార్గం చూపడం కోసం సమావేశం అయినట్లు సమాచారం.?

వార్డు సమస్యలపై అర్జీల స్వీకరణ

కౌన్సిలర్ షబానా అయుబ్



మిర్యాలగూడ, (సింగిడి): మిర్యాలగూడ మునిసిపల్ 43వ వార్డు సమస్యలు తెలుసుకునేందుకు కౌన్సిలర్ షబానా అయూబ్ ఆధ్వర్యంలో వార్డు సభ ఆదివారం నిర్వహించగా మహిళలు, యువకులు, పెద్దలు కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సమస్యలను వివరించారు. సమస్యలను నమోదు చేసుకుని ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కౌన్సిలర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే, నేత బత్తుల లక్ష్మారెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చైతన్యపర్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్ అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి వివరించి ఎలినివో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదం గురించి వార్డు ప్రజలకు వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వార్డు ప్రజలకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. వార్డు ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం మేమున్నామంటూ భరోసా కల్పించారు. వార్డు సభలు నిర్వహించి సమస్యలు తెలుసుకోవడం పట్ల కౌన్సిలర్ను అభినందించారు, ఇలా ఏ కౌన్సిలర్ చేయలేదన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు వాసా శివ, చిలుక విజయ్, మన్సూర్ భాయ్, ఫక్రోద్దీన్, అజీమ్, ప్రదీప్, మోహన్, ఆలీఖాన్, బాలరాజు, షబానా, జమిలా, రజియా, రహిమా, సైదమ్మ, పద్మ, శంషాద్, అనేక మంది పెద్దలు పాల్గొన్నారు

ట్రిప్పర్లతో ఇబ్బందులు.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



పాలకవీడు, (సింగిడి): దామరచర్ల రైల్వే లైన్ నిర్మాణం కోసం జాన్‌పహాడ్ చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ట్రిప్పర్లతో శూన్యపహాడ్ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ సుమారు 20 ట్రిప్పర్లు గ్రామం మధ్య నుంచి వెళ్తుండటంతో రోడ్డు గుంతలమయమైందని, ద్విచక్ర వాహనదారులు, కార్లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారని బీజేపీ పాలకవీడు మండల అధ్యక్షుడు రమావత్ నరి నాయక్ ఆరోపించారు. ట్రిప్పర్ పంక్చర్ కావడంతో గ్రామం మధ్యలో మట్టి అన్‌లోడ్ చేయడం వల్ల దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై అధికారులు స్పందించి, గ్రామస్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన గ్రామ ప్రజలతో కలిసి డిమాండ్ చేశారు.

నాగారం ప్రాంగణంలో కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసుల మాక్ డ్రిల్



కీసర (సింగిడి): ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ నాగారం ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ బి సుమతి ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు ప్రత్యేక తనిఖీ బృందాలు పాల్గొన్నాయి. మాక్ డ్రిల్ లో భాగంగా పరిసర ప్రాంతాల్లో అనుమాదాస్పద వ్యక్తుల బ్యాగులు, వాహనాలు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సహకారంతో వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు.

స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటు నమోదు చేసుకుంటున్న గ్రాడ్యుయేట్లు

మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



నల్లగొండ ప్రతినిధి (సింగిడి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ పట్టణంలో ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది . శనివారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి పలువురు యువకులు, విద్యావంతులు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులు అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డిని కలిసి నమోదు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి యువతను అభినందిస్తూ, యువత చైతన్యవంతంగా ఆలోచించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన తీర్పు ఇవ్వాలని, ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజకు రూ.15 వేల విరాళం

కోదాడ, (సింగిడి): అనంతగిరి: మండలంలోని ఖానాపురం గ్రామంలో నవంబర్ 6న గట్టిగుండ్ల ఆశీర్వాదం 18వ పడి సందర్భంగా అయ్యప్ప స్వామి పడి పూజ, ఊరేగింపు, అగ్నిగుండం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గ్రామానికి చెందిన కట్ల గోపి చౌదరి రూ. 15 వ

పూసల సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయిస్తా

బోరుబావి కూడా ఏర్పాటు చేయిస్తా: ఎంపీ గడ్డం వంశీకృష్ణ
పూసల సంఘం నూతన అధ్యక్షుడు కుమారస్వామికి అభినందనలు



పెద్దపల్లి, (సింగిడి): పూసల సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి అవసరమైన నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చారు. సంఘం అవసరాల మేరకు బోరుబావి ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఆదివా రం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పూసల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుమారస్వామితో పాటు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం సంఘం ప్రతినిధులతో సమావేశమైన ఎంపీ, భవన నిర్మాణం, సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి సంబంధిం చిన అంశాలపై చర్చించారు. గతంలో సంఘం భవన నిర్మాణం కోసం ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ, నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అభివృద్ధికి సభ్యుల ఐక్యత కీలకమని పేర్కొన్న ఎంపీ, నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేస్తూ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. సభ్యుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఇసుక శిల్పంలో ప్రశాంత్ రెడ్డి రూపం.. వినూత్నంగా జన్మదిన వేడుక

పెద్దపల్లి, (సింగిడి): ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకుడు కొమ్మ సతీష్ యాదవ్ రాజమండ్రి గోదావరి తీరాన ఆయన చిత్రంతో ఇసుక శిల్పాన్ని రూపొందించి ప్రత్యేకంగా శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో విశేష కృషి చేస్తూ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు



బాటలు వేస్తున్న దాసరి ప్రశాంత్ రెడ్డి యువత

కు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాల తో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. దాసరి ప్రశాంత్ రెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

కార్మిక హక్కుల కోసం హైదరాబాద్‌కు రైస్ మిల్లు కార్మికులు

ఇందిరా పార్క్ మహా ధర్నాకు సుల్తానాబాద్ నుంచి తరలింపు
జెండా ఊపి ప్రారంభించిన జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య



సుల్తానాబాద్, (సింగిడి): కార్మిక హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లతో సు ల్తానాబాద్ రైస్ మిల్లు కార్మికులు హైదరాబాద్ బాట పట్టారు. సీఐటీయూ రాష్ట్ర కమి టీ ఆధ్వ ర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పా ర్క్ వద్ద నిర్వ హించే మహా ధర్నాలో పాల్గొనేందు కు బయలు దేరిన కార్మికుల వాహనా లను సీఐటీ యూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగిస్తూ యజమానులకు ప్రయోజనం చేకూర్చేలా ఉన్నా యని తాము భావిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ. 42 వేలు చెల్లించాల ని, పని భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పిం చాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైస్ మిల్లు కార్మికులకు ఇచ్చిన హామీలను అమ లు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల ను విడనాడాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివే యాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోస ం నిర్వహిస్తున్న ఈ మహా ధర్నాకు సుల్తానాబాద్ నుంచి పెద్ద సంఖ్య లో తరలివెళ్తున్న రైస్ మిల్లు కార్మికులను ఆయన అభినందిం చారు. కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుం దని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ము త్యంరావు, రైస్ మిల్ ఆపరేటర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి, వీరగోని కిరణ్ గౌడ్, దండి సంపత్, దుర్గం మహేందర్, విలాస్, ఆసరి మహేష్, ప్రసాద్, సదయ్య, ప్రభాకర్, లచ్చయ్య, లక్ష్మయ్య, రైస్ మిల్ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పోగుల తిరుపతి, మంజూర్, అబ్బా, రియాజ్, రబ్బాని, శ్రీనివాస్, మాతంగి శంకర్, హమాలీ సంఘం నాయకులు లచ్చన్న, నరేష్, శీను, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.







ఆపదలో అండగా.. ప్రజలకు భరోసాగా..



ఇచ్చిన మాటకు కట్టుబాటు..
సేవా బాటలో బాకం సాయికిరణ్....
యువతకు క్రీడలే ప్రేరణ..
ఆపదలో ఉన్నవారికి ఆర్థిక భరోసా..
పేద విద్యార్థులకు దుస్తులు, బూట్లు..
బతుకమ్మ వేళ రూ.2 లక్షల విలువైన ధ్వని పరికరాలు..
వినాయక, దుర్గామాత మండపాలకు ప్రత్యేక ఏర్పాట్లు

సుల్తానాబాద్, (సింగిడి): ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ.. ఆపదలో ఉన్నవా రికి అండగా నిలుస్తూ.. పేద విద్యార్థు లకు చేయూత నిస్తూ.. యువతను క్రీడల వైపు ప్రోత్స హిస్తూ సుల్తానా బాద్ ము న్సి పాలిటీ ఆరో వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ తన దైన శైలిలో ముందుకు సాగుతు న్నారు. వార్డు ప్రజల అవసరాలకు స్పందించడంతో పాటు, విద్య, క్రీడలు, పండుగల నిర్వహణకు ప్రాధాన్య మిస్తూ



వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నా రు. పదవిని ప్రజాసేవకు వేదికగా మలు చు కుంటూ తన పరిధిలో సాధ్యమైన సహాయాన్ని అందిస్తు న్నారు.

ఆపదలో అండగా..

ప్రజలకు భరోసాగా...

ఆరో వార్డులో ఎవరికి ఆపద వచ్చినా తనవంతు సహాయం అందించేందుకు సాయికిరణ్ ముం దుంటు న్నారు. ఆర్థిక ఇబ్బం దులతో సతమత మయ్యే వారికి తోడ్పాటు అందిస్తూ, ప్రజల కష్టసు ఖాల్లో భాగస్వామి గా నిలుస్తున్నా రు. వార్డు ప్రజ లకు ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే, సాధ్యమైనంత మేరకు పరిష్కారా నికి కృషి చేస్తున్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలను నిర్వర్తించ డంతో పాటు, మానవతా దృక్ప థంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతు న్న పేద విద్యార్థినీ విద్యార్థులకు దుస్తులు, బూట్లు అందిస్తూ వారి చదువుకు చేయూతనిస్తు న్నారు. విద్యార్థులకు అవసరమైన సౌక ర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో పాఠశా లను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. పేదరికం కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూ డదనే లక్ష్యంతో వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. వి ద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడట మే సమా జానికి చేసే నిజమైన సేవ అనే భావనతో ముం దుకు సాగుతున్నారు.

బతుకమ్మ వేళ

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు....

తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతుక మ్మ పండుగ సందర్భంగా ఆరో వా ర్డు ప్రజలకు ఇచ్చిన హామీ మే రకు సుమారు రూ. 2 లక్షల విలువైన ధ్వని పరికరాలను సాయికిరణ్ అందజేశారు. వార్డులోని బతుక మ్మ వేడుకలకు ఉపయోగపడేలా ఈ పరికరాలను సమకూర్చడం విశేషం.

అంతేకాకుండా వినాయక చవితి, దుర్గా మాత ఉత్సవాల సందర్భంగా భక్తులకు, నిర్వాహ కులకు సౌకర్యంగా ఉండేలా మం డపాల వద్ద తన సొంత ఖర్చులతో షెడ్లను ఏర్పాటు చేయించారు. పండు గల నిర్వహణకు అవసరమై న సదుపా యాలు కల్పిస్తూ, సా మూహిక వేడుక లకు తనవంతు సహకారం అందిస్తున్నారు.

యువత పెడదారి పట్టకుండా..

క్రీడల వైపు...

నేటి యువతలో క్రీడాస్ఫూర్తిని పెం పొం దించి, చెడు వ్యసనాలకు దూ రంగా ఉంచాలనే లక్ష్యంతో సుల్తానాబాద్ ప్రీమి యర్ లీగ్ క్రికెట్ పోటీల నిర్వహణకు సాయికిరణ్ ప్రత్యేక ప్రాధాన్యమిస్తు న్నారు. యు వతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు, క్రమశిక్ష ణ, జట్టుగా పనిచేసేతత్వం, ఆరో గ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొం దించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించారు. పెద్దపల్లి నియో జకవర్గ స్థాయిలో పది జట్లు పాల్గొ నేందుకు పాల్గొని విజయవంతంగా పూర్తి అయ్యా యి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు సూచనల మేరకు యువతను క్రీడలవైపు ప్రో త్సహించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువత తమ శక్తిసామర్థ్యా లను సానుకూల దిశలో వినియోగించు కుంటే వ్యక్తి గతంగా ఎదగడంతో పాటు సమా జానికి కూడా మేలు జరుగుతుం దనే భావనతో క్రీడా పోటీలకు ప్రో త్సాహం అందిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుల్తానాబాద్ సహకార సంఘం సత్తా

79 మార్కులతో ప్రత్యేక గుర్తింపు
రైతుల నమ్మకమే మా విజయానికి పునాది: చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్





సుల్తానాబాద్, (సింగిడి): ఉమ్మ డి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘాల పనితీరు మూ ల్యాంక నంలో సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం 79 మార్కులు సాధించి ప్రత్యేక గుర్తిం పు పొందింది. కరీంన గర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా ల పరిధిలోని సహకార సంఘాల పనితీరును పరిశీలించిన నేపథ్యంలో సుల్తానాబాద్ సంఘా నికి ఈ గుర్తింపు లభించడం పట్ల పాలకవర్గం హర్షం వ్యక్తం చేసింది.

రైతు సేవలే మా లక్ష్యం.. వాటి ఫలితమే ఈ గుర్తింపు..

ఈ సందర్భంగా సంఘం తాత్కాలిక పాలకవ ర్గం అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సహ కార సంఘాల మూల్యాంకనంలో సుల్తానాబాద్ సంఘం 79 మార్కులు సాధించడం ఆనందం గా ఉందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యం తో చేస్తున్న కృషికి ఈ గుర్తింపు ప్రోత్సాహాన్నిస్తుం దని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాల సరఫరాను సమర్థంగా నిర్వహిం చడం, ధాన్యం సేకరణలో పారద ర్శకత పాటించడం, రుణాల వసూళ్లలో పురో గతి సాధించడం వంటి అంశాలకు ప్రాధా న్యమిస్తు న్నామని తెలిపారు. సంఘ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయడం తోపాటు ఆధునిక సాంకే తిక పరిజ్ఞానాన్ని వినియోగి స్తూ నిర్వహ ణను మరింత మెరుగు పరిచేందు కు కృషి చేస్తున్నామని వివరించారు. రైతులు తమపై ఉంచిన నమ్మకం, సంఘ పాలకవర్గ సభ్యుల సహకారం, సిబ్బంది నిరంతర కృషి వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని శ్రీగిరి శ్రీనివా స్ అన్నారు. ఈ విజయానికి సహకరిం చిన రైతులు, సంఘ సభ్యులు, అధికారులు, సిబ్బం దికి కృతజ్ఞతలు తెలిపారు. సుల్తా నాబాద్ సహకార సంఘానికి 79 మార్కులతో ప్రత్యేక గుర్తింపు లభించడంపై సంఘ సీఈవో సంతో ష్ హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌నినో ముప్పు పొంచి ఉంది

రైతులు అప్రమత్తంగా ఉండాలి
ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి
నీరు, విద్యుత్తును పొదుపుగా వినియో గించాలి
పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్

సుల్తానాబాద్, (సింగిడి): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతు లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ సూచించారు. రా బోయే కాలంలో నీటి ఎద్దడిసమస్యలు తలెత్తకుం డా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు నీటి ల భ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చా రు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ని ర్వహించిన విలేకరుల సమావే శంలో అంతటి అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో సాగునీరు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, పెద్ద పల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం ఎమ్మె ల్యే మక్కాన్ సింగ్ సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుం టు న్నారని తెలిపారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగిం చుకోవడం ప్రతి ఒక్కరి



బాధ్యత అని అ న్నారు. పక్కతి వైపరీ త్యాలను రాజకీయలకు ఆపారాధిస్తూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిం చకూడదని కోరారు.

నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టుకోవాలి...

భవిష్యత్తులో నీటి కొరతను అధిగ మించేందుకు ఇప్పటి నుంచే నీటి వృథాను అరికట్టాలని, విద్యుత్తు ను పొదుపు గా వినియోగించాలని ఆయన సూచించారు. రైతులు పంటల ఎంపికలో వాతావరణ పరిస్థితు లు, నీటి లభ్యత ను పరి గణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముం దస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచే స్తోందని అంతటి అన్నయ్య గౌడ్ తెలిపారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసా య విధానాలను అనుసరి స్తూ నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రె స్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచజన్య సభకు మంచిర్యాల సేన

వెయ్యి బైకులతో ఇంద్రవెల్లికి

మంచిర్యాల, (సింగిడి): : రాజకీయ సంకల్పాన్ని చాటేందుకు.. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నిం పేందుకు తెలంగాణ రక్షణ సేన సమా యత్తమవుతోంది. ఈ నెల 30న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహిం చనున్న పాంచజన్య సంకల్ప సభకు మంచిర్యాల జిల్లా నుంచి భారీగా తరలి వెళ్లాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చా రు. సభకు బైకిలపై పెద్ద సంఖ్యలో కార్యక ర్తలు హాజరయ్యేలా కార్యాచరణ రూపొం దిస్తున్నారు. జిల్లా నుంచి సుమారు వెయ్యి బైకులతో తరలివెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ కార్మిక శాఖ మంత్రి బోడ జనార్దన్ కార్యాలయంలో పాంచజన్య సంకల్ప సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రక్షణ సేన



జిల్లా అధ్యక్షుడు డా. ఉదారి చంద్రమో హన్ గౌడ్ మాట్లాడుతూ.. సభకు మంచి ర్యాల జిల్లా నుంచి నాయకులు, కార్యకర్త లు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. వెయ్యి బైకులతో సభకు వెళ్లేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు. మాజీ మంత్రి బోడ జనార్దన్ మాట్లాడుతూ.. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు అధిక సంఖ్యలో సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సభ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమీకరించి, సమష్టి కృషితో సభకు తరలివెళ్లాలని కోరారు.

పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి

ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పాంచజ న్య సంకల్ప సభ నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలో పార్టీ నాయకులు సమీకరణపై దృష్టి సారించారు. బైక్‌లతో భారీ ర్యాలీగా తరలివెళ్లేలా ప్రణాళికలు రూపొందించ డం ద్వారా సభకు జిల్లా నుంచి బలమైన హాజరు ఉండేలా ప్రయత్నిస్తున్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి తిప్పర్తి సారన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా యువజ న అధ్యక్షుడు ఐత ప్రశాంత్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పొలసాని హారిక రావు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, కొరకొప్పుల మహేష్ గౌడ్, వేముల సాయి కుమార్ గౌడ్, సందీప్ గౌడ్, సంపత్, అనిల్, సంపత్ కుమార్, జహీర్ ఖాన్, శ్రీవాణి, రజిత, హెచ్ఎం ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం కలకు ఎంపీ చేయూత

మంచిర్యాల, (సింగిడి): సమాజ అభివృద్ధికి సంఘటిత శక్తి తోడైతే.. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధుల చొరవ లభిస్తే ఆశించిన ప్రగతి సాధ్యమవుతుంది. ముదిరాజ్ సమాజం అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. మంచిర్యాల పట్టణంలో ముదిరాజ్ భవన నిర్మాణా నికి ఎంపీ నిధుల నుంచి రూ. 25 లక్షలు కేటాయిస్తానని ప్రకటించారు. భవనానికి స్థలం కేటాయించే అంశాన్ని మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. మంచిర్యాలలో నిర్వహించిన ముదిరాజ్ సింహగర్జన సభలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముదిరాజ్ సమాజానికి సొంత భవనం నిర్మించుకోవాలన్న ఆకాంక్షకు ఎంపీ నిధుల కేటాయింపు ప్రకటన ఊతమివ్వనుంది. సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు, సంఘ కార్యకలాపాలకు భవనం ఉపయోగపడనుంది. అయితే నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు కూడా కీలకం కావడంతో.. ఈ అంశం పై మంత్రి, కలెక్టర్‌తో మాట్లాడి ముందుకు తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారు. నిధుల కేటాయింపుతోపాటు స్థల సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని ప్రకటించిన సభలో ప్రాధాన్యం సంతరిం చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,800 ముదిరాజ్ సొసైటీలు ఉండగా.. మంచిర్యాల ప్రాంతంలోనే వెయ్యికి పైగా ఉన్నాయని ఎంపీ పేర్కొన్నారు. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం, చైర్మన్ల ఎంపిక వంటి అంశాలపై సంఘ సభ్యుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను ఆయన ప్రస్తావించారు. ఎన్నికలు త్వరగా జరిగేలా సంబంధిత అధికారులను కోరతానని, ఈ ప్రక్రియలో ముదిరాజ్ సంఘానికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. సొసైటీలకు పాలకవర్గాలు ఏర్ప డితే సంఘ కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంఘ సభ్యులకు సంబంధించిన బీమా పథకాలలో కొన్ని కేసులు పెండింగ్‌లో ఉండటం, మరికొన్నింటిపై నిర్ణయాలు తీసుకోకపోవడం వంటి సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఎంపీ తెలిపారు. అర్హులైన సభ్యులకు న్యాయం జరిగేలా ఈ సమస్యల ను పరిశీలించి, న్యాయబద్ధమైన పరిష్కారం లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమాజంలోని సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చొరవ చూపుతానని తెలిపారు. దివంగత కాకా వెంకటస్వామి సేవలను గుర్తు చేసుకున్న ఎంపీ వంశీకృష్ణ.. తనను పార్లమెంట్‌కు పంపించి ఆశీర్వదించిన ముదిరాజ్ సమాజ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆశీర్వాదం తనపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధి, సంక్షేమం, సంఘ బలోపేతానికి అవసరమైన ప్రతి అంశంలో తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. "మీ సమస్యల పరిష్కారం కోసం ముందడుగు వేస్తాను. మీకు అండగా ఉంటాను. ముదిరాజ్ సమాజం అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తాను" అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సభాముఖంగా భరోసా ఇచ్చారు.



మంచిర్యాల ఘటనలపై డీజీపీకి నివేదిక

మంచిర్యాల, (సింగిడి): పండుగల వేళ చోటుచేసుకున్న ఘటనలు.. వాటి వెనుక ఉన్నపరిస్థితులు.. బాధితులకు న్యాయం జరగాలన్న ఆకాంక్ష.. ఈ అంశాలపై మంచిర్యాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మంథన జగన్‌మోహన్‌రావు రాష్ట్ర పోలీసు ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌ను తన బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలతో పాటు తాళ్లపేట గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు. పండుగలు ప్రజల మధ్య ఆనందం, ఐక్యతను పెంపొందించే సందర్భాలు. అయి



తే ఆ వేడుకల సమయంలో చోటుచేసుకునే కొన్ని సంఘటనలు స్థానికంగా ఉద్రిక్తతలకు దారితీస్తుం టాయి. ఈ నేపథ్యంలో సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా జరిగిన పరిణామాలను మంథన జగన్‌మోహన్‌రావు డీజీపీ దృష్టికి తీసుకెళ్లడం ప్రాధాన్య ం సంతరించుకుంది. తాళ్లపేట గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను సైతం ఆయన వివరించారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, ఘటనల నేపథ్యాన్ని రాష్ట్ర పోలీసు బాస్‌కు తెలియజే శారు. ఆయా అంశాలపై పోలీసు శాఖ దృష్టి సారించాల ని కోరారు. ఈ భేటీ ద్వారా మంచిర్యాల ప్రాంతంలో చోటుచేసుకున్న ఘటనలు రాష్ట్ర పోలీసు ఉన్నతాధి కారుల దృష్టికి వెళ్లాయి. స్థానికంగా జరిగిన పరిణామాల పై ఉన్నతాధికారులకు వివరాలు అందించడం ద్వారా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు.

అంబేద్కర్ యూత్ అధ్యక్షుని ఎన్నిక

ధర్మారం,(సింగిడి): మండలంలోని పత్తిపాక లో ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ సభ్యుడుగా జిల్లెల్ల అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ మేరకు గ్రామంలో ఈ రోజున యూత్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ నూతన కమిటీ లో ఉపాధ్యక్షులుగా సుంకే నాగరాజ్, చిలుక రాజ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా ఎల్మదాసరి అజంత్, కోశాధికారిగా కాంపెల్లి వేణు కుమార్, ఎన్నికయ్యారు అలాగే సంయుక్త కార్యదర్శిగా ఎల్మదాసరి వంశీకృష్ణ, ప్రచార కార్యదర్శిగా లంక. వేణు కుమార్ ఎన్నిక కాగా, కార్యవర్గ సభ్యులుగా కాంపెల్లి అనిల్, ఎదుల్ల అజయ్, ఎల్మదాసరి కుమార్, ఎదుల్ల ప్రదీప్, చెన్నూరి అఖిల్, లంక రాకేష్, చిలుక నరేష్, జిల్లెల్ల శ్రీకాంత్, జిల్లెల్ల జయంత్, ఎల్మదాసరి చరణ్, ఎదుల్ల సాయి, ఎదుల్ల బబ్బి,



కొలపూరి అరవింద్, మోదుం పెల్లి హరీష్, కాంపెల్లి అంజన్ కుమార్, సుద్దాల వంశీకృష్ణ, జిల్లెల్ల చైతన్య,లను ఎన్నుకున్నారు.

తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తాం: సిరివేణి స్వప్న

పెద్దపల్లి, (సింగిడి): తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని, ప్రజా సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షు రాలు సిరివేణి స్వప్న తెలిపారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ సిద్ధాం తాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నా రు. నియోజకవర్గ ఇన్‌చార్జి సలేందర్ కొమురయ్య యాదవ్ ఆహ్వానం మేరకు సాగర్ల వాసవి, కూన రవళి, సాగర్ల



శ్రీశాంత్, మౌటం మల్లికార్జున్, మౌటం శ్రీశాంత్ పార్టీలో చేరారు. కరీంనగర్ జిల్లా పట్టణ అధ్యక్షుడు రంగా రావేని లక్ష్మణ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్ర మంలో నూతన సభ్యులకు నాయకులు కండువాలు కప్పి స్వాగ తం పలికా రు. కార్యక్రమంలో సీనియర్ నాయ కులు బోగని శంకర్ గౌడ్, ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్, ఎద్దు లక్ష్మీనారాయణ, గడ్డం లక్ష్మి తదితరులు పాల్

సిన్మా సింగిడి Cinma Singidi

బుధవారం
28-10-2026

మిమ్మల్ని బాధపెట్టే అవకాశం ఎవరికి ఇవ్వాలో జాగ్రత్తగా ఎంచుకోండి..

తనదైన వివాదాస్పద శైలితో, సంచలన పోస్టులతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే టాలీవుడ్ స్టార్ అండ్ సంచలన డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ.. ప్రస్తుతం సెకండ్స్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసి మళ్లీ కొత్త సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అయ్యారు. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద సరికొత్త ట్రెండ్‌ను సృష్టించిన ఈయన.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు డిఫరెంట్ జోనర్ కథలు ఎంచుకుంటూ తన మార్క్ స్ట్రైక్‌ప్లేతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయ్యాడు. ప్రజెంట్ ఆయన చేతిలో, 'పోలీస్ స్టేషన్ మే భూత్, సిండికేట్, పోలీస్ కంపెనీ వంటి వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఆయన సినిమాల పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ పలు

షాకింగ్ రామ్‌గోపాల్ వర్మ పోస్ట్

వివాదాస్పద కామెంట్స్, పోస్టులతో వార్తల్లో నిలుస్తుంటారు. ఈ క్రమంలోనే తాజాగా మరో ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో ట్రెండింగ్‌లోకి వచ్చాడు ఈ డైరెక్టర్. ఈ మేరకు .. 'జీవిత సత్యం ఏమిటంటే, మీరు ఎంతో ఇష్టపడే వ్యక్తులు ఏదో ఒక రోజు మిమ్మల్ని ఖచ్చితంగా బాధపెడతారు. కాబట్టి, మిమ్మల్ని బాధపెట్టే అవకాశం ఎవరికి ఇవ్వాలో జాగ్రత్తగా ఎంచుకోవడమే మీ వివేకం!' అంటూ ఈయన పెట్టిన పోస్ట్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతుంది. తనదైన



వివాదాస్పద శైలితో, సంచలన పోస్టులతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే టాలీవుడ్ స్టార్ అండ్ సంచలన డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ

అమ్మాయి.. అదృశ్యం.. అన్వేషణ..

రిలీజ్‌కు సిద్ధమైన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మూవీ

రాహుల్ విజయ్, ఆర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'అ' సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో పాటు 'బ్లడీ హంగర్' పేరుతో విడుదల చేసిన ఈ చిత్రం గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. ఇలా ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ఆకట్టుకోగా.. తాజాగా విడుదల తేదీ ప్రకటించారు. అయితే ఈ చిత్రాన్ని మొదట అక్టోబర్ 30న థియేట్రికల్ చేయాలనుకున్నారు. కానీ.. కొన్ని అనివార్య కారణాల చేత వాయిదా వేసి ఇప్పుడు నవంబరు 12న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల తేది కోసం రిలీజ్ చేసిన కాన్సెప్ట్ వీడియో సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది.

కాగా ఈ సందర్భంగా దర్శకుడు సాయి బాలి మాట్లాడుతూ " అందరి సపోర్ట్‌తో బెస్ట్ అవుట్ పుట్ ఇచ్చానని నమ్ముతున్నా. టైటిల్ చుట్టు ఉన్న అమ్మాయి.. అదృశ్యం.. అన్వేషణ, అనుమానం.. అసాంఘీకం... అమానుషం ఈ పదాల మధ్యే ఈ కథ మొత్తం ఉంది. రాహుల్ విజయ్‌ను ఓ సీన్సియర్ పోలీస్ ఆఫీసర్‌గా ఈ సినిమాలో కనిపిస్తాడు. ఇన్వెస్టిగేషన్ డ్రామాలో ఆయన కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్ ఉంటుంది. నవంబరు 12న విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పుకొచ్చారు.

ఈ విషయంలో మార్పు మొదలైంది!

'ఏషనాగుల కట్ట మీద..' అంటూ ఇటీవలే థియేటర్లలో తన స్టెప్పులతో ఉర్రూతలూగించిన కథానాయిక కీర్తి సురేశ్.. ఇప్పుడు లేడీ డాన్‌గా తనలోని మరో కోణాన్ని సినీప్రియులకు పరిచయం చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఆమె, రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'అక్క'. కల్పిత నగరంలోని మాతృస్వామ్య సమాజ నేపథ్యంలో సాగే ఈ సిరీస్ ఈ నెల 30న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న కీర్తి మాట్లాడుతూ.. "మహిళా ప్రాధాన్య పాత్రలతో కూడిన యాక్షన్, గ్యాంగ్‌స్టర్ చిత్రాలు వెండితెరపై చాలా తక్కువగా వస్తుంటాయి. నిజ జీవితంలో కూడా మనకు పురుష గ్యాంగ్‌స్టర్ల గురించే ఎక్కువ తెలుసు. వారి కథలు వింటూనే పెరిగాం. బహుశా అందుకనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అయితే మహిళా ప్రధానాంశాలతో కూడిన కథనాలపై నమ్మకం లేని చిత్రనిర్మాతలూ ఉన్నారు. వారు కూడా లేడీ ఓరియెంటెడ్ సినిమాల కొరతకు ఒక కారణం. గ్యాంగ్‌స్టర్, పూర్తిస్థాయి యాక్షన్ కథను ఒక నటి సమర్థవంతంగా చేయగలదని ప్రతి దర్శకుడూ నమ్మకపోవచ్చు. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించట్లేదు. కథ బాగుంటే చాలు.. నటీమణులతో సంబంధం లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అందుకే నాయికా ప్రాధాన్య చిత్రాల విషయంలో మార్పు మొదలైందని అనుకుంటున్నా" అని చెప్పుకొచ్చారు.



రష్మికకు మధుబాల మద్దతు

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హిందీ సినిమాల్లో తన దక్షిణాది యాసపై సామాజిక మాధ్యమాల్లో ఎదురైన ట్రోలింగ్ గురించి మాట్లాడారు రష్మిక. తాను దక్షిణాదికి చెందిన అమ్మాయిని అయినప్పుడు సహజమైన యాసను తప్పుగా చూడడంలో అర్థం లేదని అన్నారు. తాజాగా ఈ విషయంపై ప్రముఖ రచయిత జావేద్ అక్తర్, నటి మధుబాల రష్మికకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జావేద్ ఎక్స్ వేదికగా.. "నటి రష్మిక యాసపై ఎవరికైనా సమస్య ఉంటే వారికి ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన భాషల్లో కొన్ని వాక్యాలను చదవమని చెప్పండి. అప్పుడు వారు ఎంత బాగా వాటిని చెప్పగలరో చూద్దాం. ఇలాంటి అవాస్తవ, నిరాధార భాషా ఆధిక్యత ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని పేర్కొన్నారు. అలానే మధుబాల కూడా మద్దతు తెలుపుతూ ఇన్‌స్టాలో ఓ వీడియోను పంచుకున్నారు. "రష్మిక నువ్వు విమర్శలను చూసి నవ్వుతూ, వాటిని అంగీకరించిన తీరు.. హుందాగా సమాధానం చెబుతూ ముందుకు సాగడం నాకు ఎంతో నచ్చింది. ఇలానే ఆత్మవిశ్వాసంతో ఉండాలి. నేను హిందీ సినిమాల్లో నటించడం ప్రారంభించినప్పుడు దక్షిణాదికి చెందిన అమ్మాయిననే కారణంతో ఎలాంటి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందో అని భయపడేదాన్ని. ఉర్దూ టీచర్‌ని పెట్టుకుని హిందీ భాషపై పట్టు సాధించాను. నా యాస బయటపడకుండా ఉండేందుకు ప్రయత్నించే దానిని. దక్షిణాది యాసతో కూడిన నా గుర్తింపు పట్ల నేను గర్వపడుతున్నాను. ఇక్కడికి చేరుకోవడానికి నాకు 30ఏళ్లు పట్టింది. నువ్వు ఇప్పటికే ఆ స్థాయికి చేరుకున్నావు" అని అందులో అన్నారు మధుబాల.





'రామాయణ' సంగీతంపై ట్రోలింగ్..

AR రెహమాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

రణబీర్ కపూర్, సాయిపల్లవి జంటగా, నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ పౌరాణిక చిత్రం 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' (=ఇఖిఇఖిఇఖి: =అంవ శీట ఖూవస్త్రవఅఎ) చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ మూవీలోని 'రావణ తాండవ్' పాటతో పాటు తాజాగా విడుదలైన 'మంగళ్ రంగ్' పాటపై సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో ట్రోలింగ్ మొదలైంది. ఈ నేపథ్యంలో ఆ ట్రోలింగ్‌పై తాజాగా ఏఆర్ రెహమాన్ రియాక్ట్ అయ్యారు.





ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వచ్చే ట్రోలింగ్, ఫీడ్‌బ్యాక్ గురించి తాను ఎక్కువగా పట్టించుకోనని స్పష్టం చేశారు. తాను ఎన్నో ఎన్నో పరిశీలనలు, కసరత్తులు చేసి పాటలను రూపొందిస్తామని పేర్కొన్నారు. వాటిని పరిశీలించేసరికే తమకు ఒంట్లో శక్తి కూడా మిగలదని అన్నారు. ఎవరి పని వారు శ్రద్ధగా చేయాలని నమ్ముతానని.. పాటలు వినే వారు మొదట విమర్శించినప్పటికీ, ఆ తర్వాత వాటిని ఆస్వాదించి అభినందిస్తారని పేర్కొన్నారు. 'రావణ తాండవ్' ట్రాక్‌కి కూడా మొదట్లో వ్యతిరేకత వచ్చినా, ఆ తర్వాత శ్రోతలు దానిని ఎంతగానో మెచ్చుకున్నారని ఆయన రెహమాన్ గుర్తుచేశారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737